Crime Mirror
QR Code

https://epaper.
crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
12-2-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 90

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## జెఇఇ మెయిన్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ మెయిన్ ఫలితాలు వచ్చేశాయి. సోమవారం మధ్యాహ్నం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు..

2లో

## 45 కోట్ల 'మహా' కుంభ్

- అంచనాలకు మించి భారీగా భక్తులు
- మాఘ పూర్ణిమ సందర్భంగా నేడు పోటెత్తనున్న జనం
- మేళా ప్రాంతంలో ఇప్పటికే నో వెహికిల్ జోన్‌గా ప్రకటన

2లో



# సంపద సృష్టించి పేదలకు పంచాలన్నదే లక్ష్యం

### సమర్థ నాయకత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యం

### అందరూ కష్టించి ముందుకు సాగడం మన కర్తవ్యం

### అధికారులతో సిఎం చంద్రబాబు స్పష్టీకరణ



**సంపద సృష్టించి పేదలకు పంచాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సమర్థ నాయకత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. తను, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, ఎన్‌డిఎ లక్ష్యం ఇదేనని అన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.**

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** 'గత ఐదేళ్ల విధ్వంసంతో చాలా వెనుకబడిపోయాం. నెమ్మదిగా ఒక్కో సమస్యను అధిగమిస్తూ ముందుకెళ్తున్నాం. ఆరు నెలల పాలనలో 12.94 శాతం వృద్ధి రేటు కనపడింది. ఫైళ్ల పరిశీలనలో వేగం పెంచాలి. వచ్చిన సమస్యలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి. సమస్యలను పరిష్కరించి నప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదేదో కొంతమందిని ఎత్తిచూపడం కాదు.. వ్యవస్థ మెరుగుపడాలి. రేపటికి మన ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతోంది. గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనను ప్రజలు అంగీకరించలేదు. మనపై విశ్వాసం పెట్టుకుని భారీ మద్దతు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడల్లా ఏదో ఒక సవాల్ ఉండేది. ఒకట్రెండు కాదు..

2లో

# ఏఐతో ఉద్యోగాలు పోవు

## పారిస్ ఏఐ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

- కొత్త రకాల ఉద్యోగాలు పుట్టుకొస్తాయి..
- అందుకుతగ్గ నైపుణ్యాలు సాధించాలి
- పారిస్ ఏఐ యాక్షన్ సమ్మిట్
- 2025లో యువతకు ప్రధాని మోదీ ఉద్బోధ
- ప్రపంచవ్యాప్తంగా కనీవినీ ఎరుగని విస్తృతి,
- వేగంతో ఏఐ అభివృద్ధి చెందుతోందని వెల్లడి
- ఓపెన్‌సోర్స్ ఏఐ వాడకంలో ప్రపంచ మార్గదర్శకాల
- రూపకల్పన కోసం ఉమ్మడి కసరత్తు తప్పనిసరని స్పష్టీకరణ
- 'ఏఐ ఫౌండేషన్', 'సుస్థిర ఏఐ మండలి' ఏర్పాటు నిర్ణయంపై హర్షం

పారిస్: అన్ని రంగాల్లోకి దూసుకొస్తున్న కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు మాయమవుతాయన్న భయాలను ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికగా పటాపంచలు చేశారు. సాంకేతికత వాడ కం వల్ల ఉద్యోగాలు కనుమరుగుకావని తేల్చిచెప్పారు. కేవలం ఉద్యోగాల స్వభావమే మారుతుందని స్పష్టం చేశారు. ఏఐ వాడకంతో కొత్త రకాల ఉద్యోగాలు పుట్టుకొస్తాయని వెల్లడించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి మంగళవారం ఏఐ యాక్షన్ సమ్మిట్%-%2025కు సహాధ్యక్షత వహించిన ప్రధాని మోదీ ఈ అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు.






## తమిళనాడు కేరళలల్లో పవన్ పర్యటన

- ఆలయ సందర్శనతో సనాతన ధర్మ పోరాటం
- పవన్ నిర్ణయంతో రాజకీయంగా సర్వత్రా ఆసక్తి

2లో

## వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ.. చికెన్ షాపుల మూసివేతకు ఆదేశాలు





# రాజకీయాలకు అతీతంగా వర్గీకరణ

### మంద కృష్ణ మాదిగతో సీఎం రేవంత్

### సమస్యలను మంత్రివర్గ ఉపసంఘం, కమిషన్‌కు వివరించాలని సూచన

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌తో ఆయన భేటీ అయ్యారు. వర్గీకరణ పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించారని కృతజ్ఞతలు తెలిపారు. అయితే కొన్ని లోపాలు ఉన్నాయంటూ ఆయన సిఎం దృష్టికి తీసుకుని వెళ్లారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. 'సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేశారు. ఇందులో రేవంత్‌రెడ్డి భాగస్వామ్యం అయ్యారు. అందుకే వారికి ధన్యవాదాలు తెలిపాం.

## సంతోష్‌కుమార్‌తో కలిసి 'వృక్షార్చన' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్



### కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయామని ప్రజలు భావిస్తున్నారు: కేటీఆర్

### ప్రజలు తిడుతున్నా సీఎం రేవంత్ రెడ్డి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు

### స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలకు ఖమ్మం జిల్లా మంత్రుల కుట్రలు

### మాజీ మంత్రి పువ్వాడ ఇంట్లో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నేతల భేటీ

హైదరాబాద్: 'కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయామని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టి ప్రజలు కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో మంత్రుల మధ్య సయోధ్య లేకపోవడంతో తెలంగాణ అధోగతి పాలైంది. ప్రజలు తిడుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసంలో




# రాజకీయాలకు అతీతంగా వర్గీకరణ

(మొదటి పేజీ తరువాయి)

పలు సమస్యలను సీఎంకు వివరించగా, వాటిని మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌తో భేటీ ఎస్సీ వర్గీకరణ ఉపసంఘం చైర్మన్, నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మందకృష్ణ మాదిగ సమావేశం అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచన మేరకు ఉత్తమ్‌తో భేటీ అయ్యారు. మాదిగలకు 9 శాతం కాకుండా 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే వర్గీకరణలో మాదిగల్లోని కొన్ని ఉపకులాలకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

# తమిళనాడు కేరళలల్లో పవన్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఎపిలో రాజకీయపరిణామాలు వేగంగా చోటుచేసుకుంటున్నాయి. ప్రజారాజ్యం జనసేనగా రూపాంతరం చెందిందని నటుడు చిరంజీవి చెప్పడం ద్వారా ప్రత్యక్షంగా ఇక తనమద్దతు జనసేనకే అని చెప్పకనే చెప్పారు. అంటే తన అనుయాయులు అంతా పవన్ వెంట నడవాలని ఓ రకంగా ఆదేశించినట్లే. అయితే ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే.. జనసేనను బిజెపిలో విలీనం చేస్తారా అని వైకాపా నేత అంబటి రాంబాబు సెటైర్లు విసిరారు. ఈ క్రమంలో కూటమి భాగస్వామిగా ఉన్న బిజెపి ఇప్పుడు దక్షిణాదిపై మరోమారు దృష్టి సారించంది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన నేత పవన్ కళ్యాణ్ బిజెపికి ఆశాకిరణంలా కనిపిస్తున్నారు. సనాతన ధర్మంపై ఇటీవల తిరుమల లడ్డూ సందర్భంగా గట్టిగా స్పందించిన పవన్, చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌పైనా దాడిని తీవ్రంగా తప్పుపట్టారు. సనాతన ధర్మపరిరక్షకు సంబంధించి పవన్ మరోమారు ముందుకు కదల బోతున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 'సనాతన ధర్మ పరిరక్షణ' పర్యటనకు ముహూర్తం ఖరారైంది. ఆయన ఈ నెల 12వ తేది నుంచి కేరళ, తమిళనాడులో సనాతన ధర్మ బాట పట్టనున్నారు. మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఆయన ఆలయాలబాట పట్టనున్నారని సమాచారం. చిరంజీవితో పోలిస్తే పవన్‌కు మాస్ పుల్లింగ్ ఎక్కువే. ఆ రెండు రాష్ట్రాల్లో నాలుగు రోజులు పాటు వివిధ దేవాలయాలను సందర్శిస్తారు. మొదట కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి వెళ్తారు. అక్కడి నుంచి తమిళనాడు లోని మధుర మీనాక్షి, శ్రీపరుశరామస్వామి, అగస్థ్య జీవ సమాధి, కుంభేశ్వర దేవాలయం, స్వామిమలైయ్, తిరుత్తై సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకుంటారు. ఈ ధర్మ ప్రచార యాత్రలో పవన్ ఎక్కువ శాతం తమిళనాడు పైన మాత్రమే దృష్టి సారించినట్టు కనిపిస్తోంది. ఆ రాష్ట్రంలోనూ పట్టు సాధించాలని సకల ప్రయత్నాలు చేస్తున్న భారతీయ జనతా పార్టీ ఎన్డీఏ కూటమిలో ఉన్న జనసేనను పావుగా రంగంలోకి దించుతోందా అన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే, తమిళనాడులో వచ్చే ఏడాది ఎన్నికలు జరగాల్సి ఉంది. అక్కడ దశాబ్దాలుగా ప్రజల్లో పాతుకుపోయిన డిఎంకె, అన్నా డిఎంకె పార్టీలకు ఏ జాతీయ పార్టీ అడ్డుకట్ట వేయలేక పోతోంది. పూర్తిగా భాష, ప్రాంతీయతకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చే తమిళ ప్రజలు ఇతర పార్టీల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అయితే, వివిధ రాష్ట్రాల్లో రకరకాల ఎత్తుగడలతో అధికార పీఠాలపై దండయాత్ర సాగిస్తున్న బిజెపి తమిళనాడులోనూ పాగా వేయడానికి శాయశక్తులు ఒడ్డుతోంది. ప్రధానమంత్రి కూడా ఆ రాష్ట్రంలో పర్యటనలు జరపడం దీనికి ఒక నిదర్శనం. అక్కడ రానున్న ఎన్నికలలో ఎలాగైనా జండా పాతడానికి కమలదళం ఉవ్విళ్లూరుతోంది. అందులో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రపదేశ్ లో తమతో కలిసి వచ్చే పార్టీలైన తెలుగుదేశం, జనసేనలను వాడుకోవడానికి భాజపా అధినాయకత్వం వ్యూహ రచన చేస్తోంది. అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ద్వారా తమిళనాడు రాష్ట్రంలో ధర్మ ప్రచారానికి 'క్లాప్' కొట్టిందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఈ తెర వెనుక రాజకీయ రహస్యం ఎలా ఉన్నా జనసేన క్యాడర్ మాత్రం పవన్ వెంట నడిచేందుకు సిద్దంగా ఉన్నారు. చిరంజీవి అభిమానులు కూడా ఇప్పుడు తోడు కానున్నారు. పాతతరం ప్రజారాజ్యం నేతలుకూడా జతకలిసే అవకాశాలు లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్ లో గత ఏడాది శాసన సభ ఎన్నికలు పూర్తయ్యే వరకూ విప్లవ నేత 'చేగువేరా' భావాలను మాత్రమే అనుసరించిన పవన్, మంత్రి అయ్యాక ఒక్కసారిగా సనాతనధర్మాన్ని ఎత్తుకోవడమే భాజపాతో అంటకాగుతున్నారనడానికి నిదర్శనంగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. పవన్ తమిళనాడులో సనాతన ధర్మంపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా చర్చలకు దారి తీసే అవకాశం ఉంది. గతంలో ఉదయనిధి మారన్, స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యల్ని పవన్ తీవ్రంగా ఖండించారు. నటుడు ప్రకాశ్ రాజ్‌కు కౌంటర్ ఇచ్చారు. ఇప్పుడు పవన్ ఆ రాష్ట్రంలోనే ఆలయాల సందర్శనకు వెళ్ళడం గమనార్హం. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు పూర్తీ భిన్నమైన సిద్ధాంతాలతో ఉండే బీజేపీ తమిళులకు ఎలా దగ్గరవుతుందనేది ఆసక్తికరమైన అంశం. పవన్ కల్యాణ్ పర్యటన వల్ల వచ్చే లాభం బిజెపి ఖాతాలోకి ఎలాగూ వెళుతుంది. ఢిల్లీ విజయం తరవాత ఇప్పుడు బిజెపి దక్షిణాదిపై పూర్తిగా సారించే అవకాశాలను చేపట్టింది. ఇలా ఎక్కడ ఎప్పుడు ఎలా వెళ్లాలన్న వ్యూహంలో కమలదళ నాయకులు ఉన్నారు.

# వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ.. చికెన్ షాపుల మూసివేతకు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమగోదావరి : గోదావరి జిల్లాలను బర్డ్‌ఫ్లూ వణికిస్తోంది. కోవిడ్ పరిస్థితుల్ని బర్డ్ ఫ్లూ రెడ్ జోన్ ప్రాంతం తలపిస్తోంది. బర్డ్ ఫ్లూ సోకిన పౌల్ట్రీ ఫామ్ కిలోమీటర్ దూరం వరకు అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు.తణుకు మండలం వేల్పూరు కృష్ణానందం పౌల్ట్రీ నుండి నమూనాలను పరీక్షించగా ఏవియన్ ఇన్ఫ్లుఎంజాగా నిర్ధారణైంది. దీంతో కాళ్ల మండలం పెద్ద అమీరం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమావేశమయ్యారు. అనంతరం, వేల్పూరులోని కృష్ణానందం పౌల్ట్రీ ఫామ్ నుండి కిలోమీటర్ ప్రాంతాన్ని ఇన్ఫెక్షన్ జోన్‌గా విధించారు.ఇన్ఫెక్షన్ జోన్‌లోని కోళ్ల ఫారాలను మూడు నెలల పాటు మూసివేతకు ఆదేశాలు జారీ చేశారు. ఇన్ఫెక్షన్ జోన్ నుండి 1-10 కి.మీ. ప్రాంతాన్ని సర్వేలెన్స్ జోన్‌గా (అలర్ట్ జోన్) గుర్తించారు. అదే సమయంలో వ్యాధి సోకిన, హెచ్చరిక జోన్ (0-10 కి.మీ) లోపల, వెలుపల కోళ్లు, గుడ్ల రవాణా నిషేధం విధించారు. చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేశారు. ఆ పరిధిలో అన్ని చికెన్,ఎగ్స్ దుకాణాలు మూసివేతకు ఆదేశాలు జారీ చేశారు. చనిపోయిన కోళ్ల తొలగింపు కార్యకలాపాలలో పాల్గొనేందుకు 20 రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. గద్వాల జిల్లా పుల్లూరు టోల్ ప్లాజా వద్ద చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసింది. కోళ్లు, బాతులతో వస్తున్న లారీలను వెనక్కి పంపుతోంది.

# 45 కోట్ల 'మహా' కుంభ్



న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజలో జరుగుతున్న కుంభమేళాకి భక్తులు ఊహించని స్థాయిలో పోటెత్తుతున్నారు. కుంభమేళా(%ఖబఎఎష్ట వీవశ్రీఝ%) జరిగే 45 రోజుల్లో మొత్తంగా 45 కోట్ల మంది భక్తులు పవిత్ర గంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వం అంచనా వేయగా, కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఆ సంఖ్య దాటిపోయింది.ఈ నెల 11 నాటికే కుంభమేళాకు వచ్చిన భక్తుల సంఖ్య 45 కోట్లకు చేరిందని, మహా కుంభమేళా చరిత్రలో అతిపెద్ద మతపరమైన సమావేశాలలో ఇది ఒకటిగా మారిందని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, గొప్ప ఆచారాలు, అత్యాధునిక సాంకేతిక సమ్మిళితంగా, ఈ కుంభమేళా జనసమూహ నిర్వహణ, పారిశుధ్యం, డిజిటల్ సౌకర్యాలలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని ప్రకటించింది. కాగా బుధవారం మాఘ పూర్ణిమ(%మీఘస్త్రష్ఘు్రాబతీఅఱఝ%) సందర్భంగా కోట్ల మంది భక్తులు అమృత్ స్నానాలను ఆచరించే అవకాశం ఉందని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. మాఘ పూర్ణిమ స్నానం, గురు బృహస్పతి పూజతో సంబంధం కలిగి ఉండటం, గంధర్వుడు స్వర్గం నుండి పవిత్ర సంగమానికి దిగుతాడనే నమ్మకానికి ప్రసిద్ధి చెందడంతో ఈ స్నానమాచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారు.ఈ నేపథ్యంలో మాఘ పూర్ణిమ స్నానం సమయంలో జనసమూహ నిర్వహణను నిర్ధారించడానికి , రాష్ట్ర ప్రభుత్వం నెల 11 ఉదయం 5 గంటల నుంచే మేళా ప్రాంతాన్ని 'వాహనాలు నిషేధించబడిన ప్రాంతం'(నో వెహికిల్ జోన్')(%చీశీ ఎవష్ట్రఱఎశ్రీవ శీఅవ%)గా ప్రకటించింది. అవసరమైన, అత్యవసర సేవలను అందించే వాహనాలను మాత్రమే అనుమతిస్తుంది. మాఘ పూర్ణిమ తర్వాత ఈ నెల 26 శివరాత్రి రోజున అధిక సంఖ్యలో భక్తులు స్నానమాచరిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

**7 లక్షల మందికి పైగా వైద్య సేవలు..**

ఇక మేళాకు వచ్చే భక్తులకు విస్తృతమైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా 7 లక్షలకు పైగా యాత్రికులు వైద్య సంరక్షణ పొందారని యూపీ ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో 23 అల్లోపతి ఆసుపత్రులలో 4.5 లక్షలకు పైగా వ్యక్తులకు చికిత్స అందించామని, 3.71 లక్షలకు పైగా పాథాలజీ పరీక్షలు చేయించుకున్నారని తెలిపింది.

# సంపద సృష్టించి పేదలకు పంచాలన్నదే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్ని సవాళ్లు ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. నిర్వీర్యమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకే ప్రజలు అధికార మిచ్చారు. పాలనా వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేశాం. స్వర్ణాంధ్ర-2047 ద్వారా లక్ష్యాలను నిర్దేశిరచుకున్నాం. 15 శాతం వృద్ధిరేటుతో మన ఆర్థిక వ్యవస్థ సుస్థిరం కావాలి. అప్పులు కూడా తీర్చాల్సిన అవసరముంది. వనరులవే.. అధికారులూ వాళ్లే.. కానీ వృద్ధిలో వ్యత్యాసం రావాలంటే కార్యదక్షత కావాలని చంద్రబాబు అన్నారు. మంత్రులు, కార్యదర్శులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి 5 నిముషాలు ముందుగానే వచ్చిన చంద్రబాబు మీటింగ్‌కు మంత్రులు, కార్యదర్శులు సరైన సమయానికి రాకపోవడంతో సీఎం సీరియస్ అయ్యారు. వారి కోసం 10 నిముషాల సేపు ఐదో బ్లాక్ లో వేచి ఉన్నారు. సమావేశాలకు సైతం సమయం పాటించకపోవటంపై సీఎం అందరికీ క్లాస్ తీసుకున్నారు. ఇక నుంచి ఈ తరహా వ్యవహారాలను సహించబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్మార్ట్ వర్క్ చేస్తూనే సమయ పాలన కూడా చేయాలని మంత్రులు, అధికారులకు సూచించారు.

# జెఇఇ మెయిన్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దేశ వ్యాప్తంగా జనవరి 22, 23, 24, 28, 29 తేదీల్లో పేపర్ -1 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. స్కోర్ కార్డు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. జేఈఈ మెయిన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,11,544 మంది రిజిస్టర్ చేసుకోగా.. 12,58,136మంది హాజరయ్యారు. ఈ ఫలితాల్లో 14మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. వీరిలో ఏపీ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ, తెలంగాణ నుంచి బాని బ్రత ఉండటం విశేషం. జేఈఈ (మెయిన్) పేపర్ -2 (బీఆర్క్/బి ప్లానింగ్) ఫలితాలను తర్వాత ప్రకటించనున్నట్లు ఎన్టీఏ వెల్లడించింది. ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరుగుతాయి. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.



# సంతోష్‌కుమార్‌తో కలిసి 'వృక్షార్చన' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

జరిగిన ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.'తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చింది. సీఎం నియోజకవర్గంతోపాటు తెలంగాణలోని ప్రతీ పనికి సంబంధించిన కాంట్రాక్టు ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రికే దక్కుతున్నాయి. కాంట్రాక్టుల మంత్రి ఇచ్చే కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారు. డిప్యూటీ సీఎం 30శాతం కమీషన్లు తీసుకుని పనులు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు' అని కేటీఆర్ మండిపడ్డారు.

**ప్రత్యేక కారణాలతోనే బీఆర్ఎస్‌కు నష్టం**

'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఖమ్మంలో అసాధారణ అభివృద్ధి జరిగినా అక్కడి ప్రత్యేక రాజకీయ సమీకరణాల వల్ల బీఆర్ఎస్‌కు కొంత నష్టం జరిగింది. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా వరదల సమయంలో ప్రజలకు పైసా ఉపయోగ పడలేదు. కానీ బీఆర్ఎస్ నాయకులు ఓడిపోయినా ఏడాది కాలంగా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి.ఈ ఎన్నికల్లో పోలీసులను అడ్డం పెట్టుకొని ఏకగ్రీవాల కోసం ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చేస్తున్న కుట్రలను బీఆర్ఎస్ అడ్డుకుంటుంది' అని కేటీఆర్ హెచ్చరించారు. త్వరలో తాను ఖమ్మం జిల్లాలో పర్యటిస్తానని ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆర్ పుట్టిన రోజున 'వృక్షార్చన'**

బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17న ప్రతీ ఒక్కరూ మూడు మొక్కల చొప్పున నాటాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'వృక్షార్చన' పేరిట మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ మంగళవారం విడుదల చేశారు.

# ఏఐతో ఉద్యోగాలు పోవు

(మొదటి పేజీ తరువాయి)

ఏఐ ఆధారిత భవిష్యత్తులో రాణించాలంటే నైపుణ్యాలను పెంచుకోవడం, వాటికి మెరుగులు దిద్దుకోవడంపై యువత దృష్టిపెట్టాలని సూచించారు. అదే సమయంలో ఓపెన్‌సోర్స్ ఆధారిత ఏఐ వినియోగంలో ప్రజావిశ్వాసం, పారదర్శకత పెంచేలా, ఈ రంగంలో వివక్షను రూపుమాపేలా ప్రపంచ మార్గదర్శకాల రూపకల్పనకు ఉమ్మడి చర్యలు చేపట్టాల్సిన అవసరం కచ్చితంగా ఉందన్నారు. 'కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాలు పోతాయనేది అత్యధికం మందిని కలవరపరిచే అంశం. కానీ టెక్నాలజీ వల్ల పని మాయం కాదని చరిత్ర చాటిచెప్పింది. కేవలం పని స్వభావం మారి కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. అందుకు తగ్గట్లుగా మనల్ని మనం మలుచుకోవాలి. నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలి. కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి'అని మోదీ సూచించారు. ఈ శతాబ్దిలో కృత్రిమ మేధ మానవాళికి కోడ్‌ను రాస్తోందని.. కానీ మానవ చరిత్రలోని ఇతర మైలురాళ్లకన్నా ఇది ఎంతో విభిన్నమైనదన్నారు. "ఏఐ ఇప్పటికే మన రాజకీయ, ఆర్థిక, భద్రతా రంగాలతోపాటు సమాజాన్ని పునర్నిర్మిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలను మెరుగుపరచడం ద్వారా కోట్లాది మంది ప్రజల జీవితాలను ఏఐ మార్చగలదు. ఇంకెన్నింటినో చేయగలదు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను మరింత సులభంగా, వేగంగా చేరుకోవడంలో దోహదపడగలదు. ఇందుకోసం మనం మన వనరులు, ప్రతిభను ఏకం చేయాలి'అని మోదీ పేర్కొన్నారు.

**ఏఐలో భారత్ సత్తా..**

ఓపెన్ నెట్‌వర్క్, యాక్సెసబుల్ నెట్‌వర్క్ సాయంతో తక్కువ ఖర్చుతోనే భారత్ 140 కోట్ల మందికిపైగా ప్రజల డిజిటల్‌పరమైన మౌలిక వసతులను విజయవంతంగా అభివృద్ధి చేసిందని ప్రధాని మోదీ తెలిపారు. 'ప్రజాపయోజనాల కోసం మేం ఏఐ అప్లికేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. భారత్‌లోని భిన్నత్వాన్ని దృష్టిలో పెట్టుకొని సొంతంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం)ను అభివృద్ధి చేస్తున్నాం'అని మోదీ తెలిపారు. స్టార్టప్‌లు, పరిశోధకులకు అందుబాటు ధరలో సాంకేతిక వనరులను అందించేందుకు ప్రత్యేకమైన ప్రభుత్వ%-%ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిని భారత్ అభివృద్ధి చేసిందన్నారు.

ఏఐ భవిత ఉన్నతంగా, అందరికీ అందుబాటులో ఉండే విషయంలో భారత్ తన నుభవాన్ని, నైపుణ్యాన్ని ప్రపంచంతో పంచుకొనేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. డేటా సాధికారత, పరిరక్షక వ్యవస్థ ద్వారా డేటా శక్తిని అందిపుచ్చుకుందని వివరించారు. 'మేం డిజిటల్ కామర్స్‌ను ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ అందుబాటులోకి వచ్చేలా చేశాం. భారత్ తీసుకొచ్చిన నేషనల్ ఏఐ మిషన్‌కు ఈ దృక్పథమే పునాది. మా హయాంలో జీ20 దేశాలకు సారథ్యం వహించినప్పుడు కృత్రిమ మేధ వాడకం బాధ్యతాయుతంగా ఉండేలా, అందరి మంచికి ఉపయోగపడాలనే విషయంలో ఏకాభిప్రాయం సాధించాం. ప్రస్తుతం ఏఐ వినియోగం, డేటా గోప్యతకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనడంలో భారత్ ముందుంది'అని మోదీ తెలిపారు.

ఏఐ మార్గదర్శకాలపై ఉమ్మడి కసరత్తు ఉండాల్సిందే

ఓపెన్ సోర్స్ ఆధారిత ఏఐ వినియోగానికి సంబంధించిన ప్రపంచ మార్గదర్శకాల రూపకల్పన కోసం ఉమ్మడి చర్యలు అవసరమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. ప్రజావిశ్వాసాన్ని, పారదర్శకతను పెంపొందించడంలో, వివక్షను చెరిపేయడంలో ఈ చర్యలు దోహదపడతాయన్నారు. 'కనీవినీ ఎరుగని విస్తృతి, వేగంతో ఏఐ అభివృద్ధి చెందుతోంది. అంతకన్నా వేగంగా ఏఐ వినియోగం కొనసాగుతోంది. దీనికితోడు దేశాలకు అతీతంగా ఏఐ రంగంలో పరస్పర ఆధారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విలువలను కాపాడుకోవడంతోపాటు ఏఐపై భయాలను పారద్రోలేందుకు, ప్రజావిశ్వాసం చూరగొనేందుకు దోహదపడే ప్రమాణాలను నెలకొల్పాలి. అందుకు ప్రపంచ దేశాలు ఉమ్మడి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది'అని ప్రధాని మోదీ సూచించారు. మేధస్సుపరంగా మనిషికన్నా యంత్రాలు ఎంతో ముందుంటాయని కొందరు ఆందోళన చెందుతుంటారు. కానీ మన ఉమ్మడి భవిత, గమ్యం విషయంలో మనుషులమైన మనం తప్ప ఇంకెవరూ కీలకపాత్ర పోషించలేరు'అని మోదీ పేర్కొన్నారు.

**తదుపరి ఏఐ యాక్షన్ సమ్మిట్ నిర్వహణకు సిద్ధం: మోదీ**

తదుపరి ఏఐ యాక్షన్ సమ్మిట్‌ను భారత్‌లో నిర్వహించేందుకు ప్రధాని మోదీ ముందుకొచ్చారు. ఈ మేరకు పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్%-%2025లో ప్రతిపాదన చేశారు. సదస్సు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏఐ దృక్పథం, ఉద్దేశంలో భాగస్వామ్య పక్షాల మధ్య స్పష్టమైన ఐకత్యను చాటేలా చర్చలు జరిగాయి. ఈ ప్రక్రియకు మరింత ఉత్సాహం తెచ్చేందుకు తదుపరి యాక్షన్ సమ్మిట్‌ను భారత్‌లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం'అని పేర్కొన్నారు. మరోవైపు 'ఏఐ ఫౌండేషన్', 'సుస్థిర ఏఐ మండలి'ని ఏర్పాటు చేయాలన్న సదస్సు నిర్ణయాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. ఈ విషయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ చొరవను అభినందించిన మోదీ.. భారత్ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. అదే సమయంలో 'ఏఐ కోసం ప్రపంచ భాగస్వామ్యం'స్వభావరీత్యా సైతం నిజంగా ప్రపంచవ్యాప్తంగా ఉండాలని ఆకాంక్షించారు. దక్షిణాది దేశాలను ఇందులో సమ్మిళితం చేయాలని.. ఆయా దేశాల అవసరాలు, ఆందోళనలు, ప్రాధాన్యతలను గుర్తించాలని సూచించారు.



# ఐటిలో గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

**ఐటి రంగంలో ఊపందుకున్న ఉద్యోగాలు**

**32వ హైసియా సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు లోటు లేదని, గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్ నగరాన్ని తీర్చుదిద్దుతామని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఐటీ రంగంలో ఉద్యోగ నియామకాలు హైదరాబాద్‌లో ఊపందుకుంటున్నాయన్నారు. హెచ్ఐసీసీలో 32వ హైసియా హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన కంపెనీలకు బెస్ట్ స్కిల్స్ అందిస్తున్నామని చెప్పారు. ఐటీలో మరిన్ని ఉద్యోగాలు సృష్టిస్తామని వెల్లడించారు. ఏఐ, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలెటిక్స్, సైబర్ సెక్యూరిటీ ప్రపంచాన్ని ఏలబోతున్నా యని, వీటిని ఇప్పటికే అందిపుచ్చుకుంటున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో సాంకేతికత వినియోగంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ పారిశ్రామిక, ఐటీ హబ్‌గా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సాంకేతికత చేరాలని తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సైన్యం, అంతరిక్షంలో సాంకేతికత వినియోగం పెరగడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఆర్థిక, ఐటీ, ఏఐ రంగాల్లో రాణిస్తున్నామన్న శ్రీధర్ బాబు, దేశ ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో ఈ వాటా మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

# మాయమాటలతో బట్టలు కొనిస్తానని మోసం

**చిన్నారి కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బట్టలు కొనిస్తామని నమ్మించి ఓ తల్లి నుండి మూడు నెలల చిన్నారిని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన హైదరాబాద్ కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుల ఫిర్యాదుతో కాచిగూడ పోలీసులు గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. ఈ ఘటనపై ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నరసయ్య చెప్పిన వివరాల ప్రకారం.. గౌలిగూడా ప్రాంతానికి చెందిన బోగ నర్సింగ్ రాజ్ పంజాగుట్ట లోని ఓ ప్రేవేట్ హాస్పిటల్ లో టెక్నీషియన్ గా పని చేస్తున్నాడు. అతనికి కార్వాన్ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్ర , ఉమావతి అనే మహిళతో పరిచయం ఉంది. ఉమావతి పని చేస్తున్న బట్టల షాపులో పని చేస్తున్న సంధ్యారాణి అనే మహిళకు పిల్లలు లేకపోవడంతో, తాను పెంచుకోడానికి పిల్లలు కావాలని ఉమావతిని కోరింది. ఉమావతి ఈ విషయాన్ని నర్సింగ్ రాజ్ , రాఘవేంద్ర లకు తెలిపింది. వారు తమకు తెలిసిన వాళ్ళు పిల్లలను దత్తతకు ఇస్తారని , వారికి లక్షన్నర డబ్బులు ఇవ్వాలని సంధ్యారాణికి తెలిపారు. దానికి అంగీకరించిన సంధ్యారాణి తొలివిడతగా లక్ష రూపాయలు చెల్లించింది. డబ్బులు చెల్లించి ఆరు నెలలు గడుస్తున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో సంధ్యారాణి వారిపై ఒత్తిడి చేసింది. దీనితో ఎవరినైనా కిడ్నప్ చేసి , ఆమెకు చిన్నారిని అందించాలని ఎ÷-లాన్ వేశారు. చాదర్ ఘాట్ చౌరస్తా లో మూడు నెలల మగ శిశువు తో భిక్షాటన చేసున్న వరలక్ష్మి అనే మహిళ ను నర్సింగ్ రాజ్ కొత్త బట్టలు ఇప్పిస్తానని మాటల్లో పెట్టాడు. తన వెంట కాచిగూడ డీ-మార్ట్ కు తీసుకెళ్లాడు. వరలక్ష్మి బట్టలు చూస్తుండగా చిన్నారిని నర్సింగ్ రాజ్ అక్కడి నుండి తీసుకొని పరారయ్యాడు. దీనితో తల్లి వరలక్ష్మి కాచిగూడ పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కేసును ఛేదించారు. నర్సింగ్ రాజ్ చిన్నారిని ఆటో లో కార్వాన్ కు తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకుని నర్సింగ్ రాజ్ , రాఘవేంద్రలను అదుపులోకి తీసుకన్నారు. చిన్నారిని తల్లి చెంతకు చేర్చారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామని , ఉమావతి పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఐదు గంటల్లో కేసును ఛేదించిన ఇన్ స్పెక్టర్ చంద్ర కుమార్ , ఎస్సైలు సుభాష్ , రవి కుమార్, ఇతర సిబ్బందిని డీసీపీ అభినందించారు.

# అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటమి కారణంగా పోటీ చేయడం లేదు

**మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కీలక కామెంట్స్**



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్ చేశారు. ఉన్న మాటే చెబుతున్నానుని.. దీనిలో దాపరికం ఏమీ లేదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం లేదని చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంలో తాము పాల్గొనలేదన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలున్నాయన్నారు. గతంలో కూడా బీఆర్ఎస్ పోటీ చేయని సందర్భాలు ఉన్నాయని అన్నారు. మోదీ సర్కార్ వెంటనే దేశంలో జనాభా లెక్కింపు జరపాలని డిమాండ్ చేశారు. కులగణన నుంచి తప్పించుకోవటానికే మోదీ.. జనగణన చేయటంలేదని విమర్శించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు నుంచి తప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. డీ లిమిటేషన్ జరిగితే తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని చెప్పారు. 2026లో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని విభజన చట్టంలో ఉందని చెప్పుకొచ్చారు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు కోవిడ్ ప్రభావం వల్ల వాయిదా పడ్డాయన్నారు. గుడ్డి ఎద్దు చేనులో పడినట్లు.. మోదీ పాలన చేస్తున్నారని ఆక్షేపించారు. 2011లో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పేదలకు రేషన్ ఇవ్వటం ఇష్టంలేకనే జనాభా లెక్కలకు వెనకడుగు వేస్తున్నారని తెలిపారు. జనాభా లెక్కింపు జరిపితే కొత్తగా 10కోట్ల మందికి కొత్త రేషన్ కార్డులు వస్తాయని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి



## అధికారులతో సమిక్షించిన సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరా, ఇసుక అక్రమాల నిరోధంపై సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రభుత్వం కార్యాచరణకు దిగింది. రాష్ట్రంలో ఇసుక లబ్ధిని సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం తెలంగాణ సచివాలయంలో మైనింగ్ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో సి.ఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సరిపడ ఇసుక అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆమె కలెక్టర్లను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డులను భౌతికంగా తనిఖీ చేయాలని కలెక్టర్లకు ఆమె సూచించారు. తనిఖీలు నిర్వహించే బృందాలలో ఖీఆక్ష, ఆ÷ూఖ స్థాయి అధికారి ఉండాలన్నారు. అధికారులు స్టాక్‌యార్డులు, ఇసుక రీచ్‌ల ప్రవేశ, నిష్క్రమణ పాయింట్‌లతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా తనిఖీ చేయాలన్నారు. ÷ూష్ట్రంలోని ప్రధాన ఇసుక మార్కెట్లకు వెళ్లే రహదారులను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. పోలీసు, రవాణా శాఖ అధికారులతో రోడ్డు పెట్రోలింగ్ లు నిర్వహించాలని, తనిఖీల కోసం సంబంధిత శాఖలతో జాయింట్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. రీచ్‌లు, స్టాక్‌యార్డుల నుండి అనధికారికంగా ఇసుకను తరలించకుండా 24 గంటలు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు ఏమాత్రం అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ డిజి బి.శివధర్ రెడ్డి, ఎడిజిపి మహేష్ భగవత్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, డిఎంజి శశాంక, టిజిఎండిసి ఎండి సుశీల్ కుమార్ ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# రైతుల కోసం ఎంతటి పోరాటాలైనా సిద్ధం : మాజీ మంత్రి తన్నీరుహరీశ్‌రావు



**సిద్దిపేట,(క్రైమ్ మిర్రర్):** రైతుల కోసం ఎంతటి పోరాటాలు చేయటానికైనా సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని హరీష్‌రావు ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు. అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖిలో చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధరలేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీష్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్‌రావు గుర్తు చేశారు.

# మాస్టర్‌ప్లాన్‌ను రైతులకనుగుణంగా మార్చాలి

**మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను పునఃసమీక్షించి రైతులకు అనుగుణంగా జోన్లను నిర్ణయించాలని మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు గండిమైసమ్మ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. 11 సంవత్సరాలుగా జోన్ మార్పులకు నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లోని 70 మండలాలు, 24 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు, దాదాపు 7 వందల గ్రామాలున్నాయన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో భూములను పలు రకాలైన జోన్లుగా విభజించారన్నారు. దీని కారణంగా రైతులు తమ భూముల్లో సొంత ఇళ్లు కూడా నిర్మించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ గ్రోత్ కారిడార్‌లో భూమి ఉన్నా కుటుంబం గడవని దయనీయ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రైతులకు తమ భూమి తమకు ఉపయోగపడే విధంగా మార్పులు చేయాలని బీజేపీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న ఈ ప్లాన్ తక్షణమే మార్చాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా బీజేపీ కార్యదర్శిం దుండిగల్ విఘ్నే శ్వర్, మండల

# కులగణనలో పాల్గొని వారు బీసీలపై ప్రేమనా..?

**ముందు కులగణనలో పాల్గొనండి**

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు పత్రాలను పంపిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బీసీలపై ప్రేమ కురిపిస్తున్న బీఆర్ఎస్ నేతలు, మాజీ ముఖ్యమంత్రి, మంత్రులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముందుగా కులగణనలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా కులగణన దరఖాస్తులను వారికి పంపారు. ఈ సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ముందు మీరు కులగణనలో పాల్గొని.. అప్పుడు మాట్లాడాలన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆరెస్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉందా.. చేతగకపోతే నోరు మూసుకుని కూర్చోవాలన్నారు. కులగణనపై బీజేపీ కుట్ర చేస్తోందని.. సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మైనార్టీలను ఇప్పుడు కొత్తగా బీసీల్లో చేర్చలేదని.. మైనార్టీలు ఎప్పటి నుంచో బీసీల్లో ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు దమ్ముంటే కేంద్రంతో దేశ వ్యాప్తంగా కుల సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే.. బీసీ సమాజం బాధపడిందని అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట కవిత లిక్కర్ నినాదం అయి పోయిందని, ఇప్పుడు బీసీ నినాదం ఎత్తుకున్నారని అన్నారు. కవితకు అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటారని, ఆమె ఒక ఆడబిడ్డ.. ఆమెను విమర్శించాలని తమకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



# పాతబస్తీలో మెట్రో విస్తరణ ఆపాలి

**పురాతన కట్టడాలకు ప్రమాదమంటూ వ్యాజ్యం**

**17కు విచారణ వాయిదా వేసిన హైకోర్టు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మెట్రో రైలు విస్తరణపై తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పాతబస్తీలో మెట్రో విస్తరణ వల్ల పురాతన కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఏపీడబ్ల్యూఎఫ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. తెలంగాణ సీఎస్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి, మెట్రో రైలు ఎండీ, వక్ఫ్ బోర్డు సీఈవోను పిటిషనర్ ప్రతివాదులుగా చేర్చారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై ఏపీడబ్ల్యూఎఫ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పలు చారిత్రక కట్టడాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని పిటిషన్‌లో పేర్కొంది. తెలంగాణ హెరిటేజ్ యాక్ట్-2017 ప్రకారం చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సి ఉందని.. పాతబస్తీలో మెట్రోమార్గం సమీపాన చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురాణాహవేలీ, మొఘల్‌పుర సమాధుల వంటి చారిత్రక కట్టడాలు ఉన్నాయని వివరించింది. మెట్రోరైలు నిర్మాణం వల్ల ఆ కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంది. మెట్రో డిజైన్‌ను హైకోర్టు లేదా నిపుణుల బృందం ఆమోదించిన తర్వాత ముందుకు వెళ్లాలని కోరింది. అప్పటి వరకు మెట్రో నిర్మాణ పనులు నిలిపివేయాలని హైకోర్టుకు ఏపీడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు 17వ తేదీకి వాయిదా వేసింది.

# దక్షిణ భారతదేశాన్ని దోచి ఉత్తర భారత దేశాన్ని పోషిస్తున్నారు

## షేక్ మహ్మద్ రసూల్

### ఖమ్మం ఎంపి కాంటెస్ట్ అభ్యర్థి,

### ఖమ్మం జిల్లా మైనార్టీ నాయకులు



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పాలకుల సవితి తల్లి ప్రేమతో దక్షిణ భారతదేశాన్ని దోచి ఉత్తర భారత దేశాన్ని పోషిస్తున్నారని ఖమ్మం ఎంపి కాంటెస్ట్ అభ్యర్థి,
ఖమ్మం జిల్లా మైనార్టీ నాయకులు షేక్ మహ్మద్ రసూల్ ఆరోపించారు. భారతదేశంలో ఒక రాష్ట్రల నుండి పన్నుల రూపంలో తెలంగాణ రాష్ట్రం నుండి 100 రూపాయలు కేంద్ర ప్రభుత్వానికి ఇస్తే అదే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి49.8 రూపాయలు తిరిగి ఇస్తుంది అలాగే ఆంధ్రప్రదేశ్ 100 రూపాయలు ఇస్తే వెనక్కి 46 రూపాయలు ఇస్తుంది అలాగే ఉత్తర ప్రదేశ్ వంద రూపాయలు ఇస్తే వెనక్కి తిరిగిచ్చే రూపాయలు 333.2 రూపాయలు మధ్యప్రదేశ్ వంద రూపాయలు ఇస్తే 279.1 వెనక్కి తిరిగిస్తుంది. అలాగే బీహార్ రాష్ట్రం వంద రూపాయలు ఇస్తే 922.5 వెనక్కి తిరిగి ఇస్తుంది. బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కు తమ వాటాలుగా తెలంగాణ కు 3.637 కోట్లు ఆంధ్రప్రదేశ్ కు 7.002 కోట్లు తమిళనాడు కు 7.057 కోట్లు కర్ణాటక కు 6.310 కోట్లు కేరళ కు 3.330 కోట్లు 5 రాష్ట్రాలకు కలిపి మొత్తంగా 27.336 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినది. ఒక్క ఉత్తరప్రదేశ్ కు 31.039 కోట్లు బీహార్ కు 17.403 కోట్లు మధ్యప్రదేశ్ కు 13.582 కోట్లు ఈ మూడు రాష్ట్రాలకు కలిపి 62.024 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాలకు వాళ్ల ఓటు బ్యాంకును మలుచుకోవడం కోసం కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు.

# రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

### ఖమ్మం మేయర్ కు కాంగ్రెస్ మైనార్టీ నేత అబ్బాస్ బేగ్ వినతి




**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** రాబోయే రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలో మసీదులు ఖబారస్తాన్ ల వద్ద వీధిలైట్లు పారిశుద్ధ్య సౌకర్యాలు మెరుగుపరచాలని తగిన ఏర్పాట్లు చేయాలని ఖమ్మం నగర మేయర్ పూనుకోలు నీరజ కు ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు అబ్బాస్ బేగ్ వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్బాస్ బేగ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఫరీద్ ఖాద్రి సయ్యద్ మహమూద్. మహమ్మద్ వసీం రియాజ్ అబ్దుల్ అబ్దుల్లా గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి టెస్ట్ చేయించుకున్న బ్రిటన్ ప్రధాని

### అందరూ ముందుకు రావాలని ప్రధాని కీర్ స్టార్మర్ పిలుపు

లండన్,ఫిబ్రవరి: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ హెచ్ఐవీ పరీక్షను చేయించుకున్నారు. జీ7 నాయకుల్లో బహిరంగంగా హెచ్ఐవీ పరీక్ష చేయించుకున్న మొదటి ప్రధాని స్టార్మర్ అని ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈసందర్భంగా దేశ ప్రజలంతా ముందుకొచ్చి టెస్టులు చేయించు కోవాలని పిలుపునిచ్చింది. 'హెచ్ఐవీ పరీక్ష వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని స్టార్మర్ హెచ్ఐవీ టెస్టు చేయించుకున్నారు. టెరెన్స్ హిగ్గిన్స్ సంస్థతో కలిసి ర్యాపిడ్ హోమ్ టెస్టు చేయించుకున్నారు' అని ఓ ప్రకటనలో పేర్కొంది. హెచ్ఐవీ పరీక్ష ఎంతో ముఖ్యమైనదని, ఇందులో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని స్టార్మర్ వెల్లడించారు. క్షణాల్లో జరిగిపోయే ఈ పరీక్షను వారం రోజులపాటు ఉచితంగా పొందవచ్చన్నారు. 2030 నాటికి కొత్త హెచ్ఐవీ కేసులు నమోదుకాకూడదనే లక్ష్యాన్ని చేరుకునేందుకు.. ప్రజలు ముందుకొచ్చి టెస్టు చేయించుకోవాలని కోరారు. 2030 నాటికి ఒక్క హెచ్ఐవీ కేసు నమోదు కాకూడదనే లక్ష్యానికి స్టార్మర్ కట్టుబడి ఉన్నట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. దీనికి సంబంధించి ఈ ఏడాదిలో ఒక యాక్షన్ ఎ÷–లాన్ సైతం రూపొందించినట్లు వెల్లడించింది.




# అవినీతి రాజకీయాలను ప్రజలే పాతరేయాలి !

**వి**విధ కేసుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను తక్షణం రాజకీయాలకు దూరంగా చేయాల్సిన అవసరాన్ని తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రజాస్వామ్యవాదులను, లేదా భారత ప్రజలను హెచ్చరించింది. చట్టాలు చేసే ప్రజాప్రతినిధులు నేరస్తులు అయివుంటే ఆ చట్టాలు ఎలా ఉంటాయో ఊహించుకోవాలి. చట్టాలను తుంగలో తొక్కుతున్న వైనం చూస్తున్నాం. కోర్టు తీర్పులను కాలరాస్తున్న నేతలను చూస్తున్నాం. ఇలాంటి సమయంలో సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రజలకు కనువిప్పు కావాలి. అవినీతి, క్రిమినల్ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలంతా చైతన్యం కావాలి. మాకొద్దీ దగుల్బాజీ రాజకీయమని నినదించాల్సి ఉంది. మరో అన్నా హజారే లాగా ఉద్యమించాల్సి ఉంది. ప్రజలు తమ దేశం కోసం లేదా అవినీతి లేని రాజకీయం కోసం కొంత సమయం వెచ్చించాల్సి ఉంది. చిన్న లంచం తీసుకుంటేనే అరెస్ట్ చేసి బొక్కలో వేస్తున్న మనం..ఇప్పుడు క్రిమినల్ కేసులు, డబ్బులు స్వాహా చేసిన వారిని, ప్రజాధనం లూటీ చేసిన వారిని రాజకీయాల్లో కొనసాగించడం అవసరమా అన్నది చర్చించాలి. ప్రజాప్రతినిధుల కేసుల వేగవంతంపై సుప్రీం కోర్టులో సోమవారం విచారణ జరిగింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్విని ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. 42 మంది లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ తన నివేదికలో పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు లేవన్నారు. నిజానికి చట్టాలు చేసే పార్లమెంట్, అసెంబ్లీలో క్రిమనల్స్ లేదా కేసులు ఉన్నవారు మంచి చట్టాలు చేస్తారని అనుకోవడానికి లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఐదేళ్లు సిఎంగా పాలన చేశారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేశారు. తొమ్మిదిన్నరేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ అనేక ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారు. ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయనే అన్నాహజారే జనలోక్‌పాల్ బిల్లు తేవాలని డిమాండ్ చేశారు. కానీ కోర్టు కేసుల్లో ఉన్న నేతలు మళ్లీ మళ్లీ ఎన్నికవుతూ...ఈ సదాశయాన్ని తుగంలో తొక్కారు. తమ విలాసాలకు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. అందుకు కేజ్రీవాల్ నివాసం, విశాఖలో జగన్ కట్టించిన విలాసవంతమైన భవనాలే నిదర్శనం. ప్రజలు తిండికి, గుడ్డకు కష్టపడుతుంటే ..ప్రజాధనంతో జల్సాలు చేసే నేతలు దేశానికి అవసరమా అన్నది ప్రజలే ఆలోచించాలి. ఇకపోతే కేసులు ఎదుర్కొంటున్న నిందితులు ఏళ్లుగా విచారణకు రాకపోవడం, పదేపదే వాయిదాలు కోరుతుండటం జాప్యానికి మరో కారణమని నివేదికలో పొందుపరిచారు. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనం స్పందిస్తూ క్రిమినల్ కేసులుంటే ఉద్యోగంలో చేరేందుకే అనర్హులని, అలాంటిది ప్రజా ప్రతినిధులుగా ఎలా అర్హులవుతారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, దానికి అనుగుణంగా ఉన్నత పరిష్కారం ఆలోచించాలని కూడా సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని ర ష్ట్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. నిజానికి సుప్రీం వెలిబుచ్చిన అభిప్రాయాన్నే ఆనాడు అన్నాహజారే వెలిబుచ్చారు. రాజకీయ అవినీతిని తరిమేందుకు ప్రత్యేక కోర్టులు లేదా జనలోక్÷–పాల్ రావాలని డిమాండ్ చేశారు. నేను అవినీతికి వ్యతిరేకమని అంటున్న మోడీ కూడా దీనిగురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇకపోతే రాజకీయ నేతలు తెలివిలో ఆరితేరారు. లాలూప్రసాద్పై కేసు రాగానే ఆయన భార్యను రంగంలోకి దింపారు. తరవాత కుమారుడు రంగంలోకి దిగాడు. శిక్షపడిన వారిని పార్టీ పదవుల్లో ఉండరాదని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తో పార్టీని నడిపిస్తున్నారు. అందువల్ల అన్ని రకాల పరిస్థితులను ఊహించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, మేం తీసుకునే నిర్ణయం లోపభూయిష్ఠంగా ఉండరాదు. అలా ఉంటే తీర్పు ఎలాంటి ప్రభావం చూపకపోగా, వ్యవస్థపై ప్రజలు మరింతగా విశ్వాసం కోల్పోతారని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. అందుకే రాజకీయాలు నేరమయం కావడం తీవ్ర అంశమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు పార్లమెంటుకు ఎలా వస్తారని విస్మయం వ్యక్తం చేసింది. 42 శాతం మంది సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులుండడం సిగ్గుచేటని తెలిపింది. శిక్షపడ్డ ప్రజాప్రతినిధులపై కేవలంఆరేళ్ల పాటే అనర్హత వేటు వేసి వదిలేస్తే ఎలా అని కూడా సంశయించింది. వారిపై శాశ్వత వేటు వేయాలి.. చట్టాలు చేసేవారు పవిత్రంగా ఉండాలని వ్యాఖ్యానించింది. దోషిగా తేలిన వ్యక్తి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉండడం సరైనదేనా అని కూడా ప్రశ్నించింది. సుప్రీం అభిప్రాయం ప్రకారం నేరాలకు పాల్పడి శిక్ష పడ్డ రాజకీయ నేతలు చట్టసభల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా నిషేధం విధించడం అవసరం. అప్పుడే మన ప్రజాస్వామ్యంలో కళంకితును దూరం చేయగలం. ఈ విషయంలో మూడు వారాల్లోగా అభిప్రాయాన్ని తెలపాలంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిన నేపథ్యంలో వారి అభిప్రాయం ఎలా ఉన్నా ప్రజలు ముఖ్యంగా ఓటేస్తున్న ఓటర్లు చర్చించాలి. క్రిమినల్ కేసుల్లో ఉన్నవారిని నెత్తికి ఎత్తుకోవాల్సిన అవసరం ఉందా అన్నది విచారణ చేయాలి. రాజకీయాలు నేరమయం కావడం తీవ్రమైన అంశంగానే చూడాలి. చట్టసభల ప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతం చేయాల్సిందే. నేరచరిత్ర ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలను శాశ్వతంగా చట్టసభల్లో ప్రవేశించకుండా వేటువేయాలనే సుప్రీం అభిప్రాయానికి అనుగుణంగా ఓటర్లు స్పందించాలి. జనం స్పందించాలి. నేరమయ రాజకీయాలకు పాతరేయాలి. ప్రతిపాదనపై కేంద్రం, ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరినా అల ఆజరుగుందని అనుకోవడానికి లేదు. వారు సానుకూలంగా స్పందిస్తారని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. అదేదో ప్రజలే చేయాలి. నేరమయ రాజకీయ నేతలను దూరంగా పెట్టే చైతన్యంతో సాగాలి.

# ఘనంగా గ్రాండ్ టెస్ట్ బహుమతుల ప్రధానోత్సవం...

### కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు... సమాజ హితము కోరే వారే జర్నలిస్టులు...

### టిపిసిసి డెలిగేట్ ,లెఫ్ట్ కెనాల్ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి...





**కోదాడ ఫిబ్రవరి 11 క్రైమ్ మిర్రర్ :** కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ టెస్ట్ లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం, చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు అధ్యక్షతన వహించినఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాజీ లెఫ్ట్ కెనాల్ చైర్మన్ టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ... జర్నలిస్టులు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యొక్క ప్రతిభను వెలికి తీసేందుకు మంచి కార్యక్రమం నిర్వహించడం నిజంగా అభినందనీయమన్నారు. మొట్టమొదటిసారిగా ఎక్కడ నిర్వహించని గ్రాండ్ టెస్ట్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించారని ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. గత కొంతకాలంగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తప్పనిసరిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సారథ్యంలో మీ కల త్వరలోనే సహకారం అవుతుందన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు మాట్లాడుతూ.... కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా వారితో నాకు విడదీయరాని పరిచయం ఉందని, తప్పనిసరిగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని తెలిపారు. అనంతరం టి యు డబ్ల్యూ జే హెచ్ 143 యూనియన్ జిల్లా అధ్యక్షులు వజ్జే వీరయ్య మాట్లాడుతూ... జర్నలిజం కత్తి మీద సాము లాంటిదని ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న జర్నలిస్టుల సమస్యలు మారడం లేదన్నారు. గత ప్రభుత్వంలో కూడా జర్నలిస్టుల సమస్యల పరిష్కారమవుతాయని ఆశగా ఎదురు చూసామని కానీ అది సాధ్యం కాలేదని ప్రస్తుత ప్రభుత్వంలోనేన సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. అనంతరం సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజనగౌడ్ మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తప్పనిసరిగా కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తారని ఆ నమ్మకం మాకు ఉందంటూ తెలిపారు. అనంతరం కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా నియమితులైన ఏపూరి తిరుపతమ్మ, సుదీర్ దంపతులను మీడియా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ... కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి హరి కిషన్, ఎంఈఓ సలీం షరీఫ్, ఎలక్ట్రాని మీడియా జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరావు, వంగవీటి శ్రీనివాసరావు, కోలిచలం నరేష్, సిరికొండ శ్రీనివాస్, సోమపంగు గణేష్, పూర్ణచంద్రరావు,యం లక్ష్మణ్,కె సైదులు,యం సురేష్,జి రాము,జి వెంకటనారాయణ, శేఖర్, గోపాల్, వాసు, సంపత్, తదితరులు పాల్గొన్నారు

# హోటల్ యజమానులు నేరుగా వ్యవసాయ దారుల ద్వారా కూరగాయలు కొనుగోలు చేయాలి

## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 11 (క్రైమ్ మిర్రర్) :** హోటల్ పరిశ్రమ వారు నేరుగా వ్యవసాయదారులద్వారా కూరగాయలు ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. తద్వారా ఇటు రైతులకు అటు హోటల్ యాజమాన్యాలకు ఎక్కువ లబ్ధి చేకూరడంతో పాటు కల్తీ లేని ఆహార పదార్థాలు లభిస్తాయని పేర్కొన్నారు. కెపిహెచ్బి కాలనీ ఆరో ఫేస్ లో నూతనంగా ఏర్పాటుచేసిన లెమన్ రిడ్జ్ హోటల్, రెస్టారెంట్ ను ఆయన సోమవారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఎవరు ఇంట్లో వంట చేసే పరిస్థితి లేదని అందరూ హోటల్స్ పైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది అన్నారు. రమేష్ మాట్లాడుతూ వినియోగదారుల మనసు చూర గొన్నపుడే ఏ వ్యాపారమైన విజయవంతమవుతుందని రమేష్ పేర్కొన్నారు. వినియోగదారుల అభిరుచి మేరకు తమ వ్యాపార నిర్వహణ ఉంటుందని హోటల్ నిర్వాహకుడు వెంకటనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, సుధాకర్ ,ప్రకాష్ , మద్దూరి రాము, అరుణ్, ఫణి కుమార్, శివ చౌదరి, అజాచ్, సంధ్యా ,వనజ, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు...!

### ఇందిరమ్మ ఇల్లు నమూనా గృహానికి భూమి పూజ, శంకుస్థాపన చేసిన స్పీకర్..!

### లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగకుండా అధికారులు,నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..!

### రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్..!

**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు.మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇల్లు నమూనా గృహానికి శాసన సభాపతి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణం చేసుకునేందుకు పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు. ముందుగా రాష్ట్రంలోని అతి నిరుపేదలైన ప్రజలకు మొదటి విడతగా ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇండ్ల నిర్మాణంలో ప్రాధాన్యత క్రమంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అవకాశాన్ని కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు.ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందిస్తూ, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. రెండో విడతలో బండలు కలిగి ఉన్న ఇండ్లను గుర్తించి వారికి కూడా ప్రభుత్వం సహాయం చేస్తుందని ఆయన తెలిపారు. ఇండ్ల కోసం ఎంపిక చేసే లబ్ధిదారుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన వారిని ఎంపిక చేసి లబ్ధి చేకూరే విధంగా అధికారులు, నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సభాపతి సూచించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పిఏసిఎస్ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టిఏ సభ్యులు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



# హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడామీలో సివిల్ పోలీస్ హెడ్‌కానిస్టేబుల్స్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్ల 17వ బ్యాచ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ అసిస్టెంట్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు నుంచి రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు 10వ బ్యాచ్ ప్రీ%-%ప్రమోషన్ శిక్షణ ప్రారంభోత్సవానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. మొత్తం ఈ ప్రీ ప్రమోషన్ ట్రైనింగ్‌లో 292 మంది హెచ్‌సీ/ఏఎస్సై ్స నుంచి ఎస్సై ్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఆర్థిక ప్రణాళిక ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పదవీ విరమణ తర్వాత పదవీ విమరణ నిధులను మంచి రాబడి, తక్కువ ప్రమాదం ఉన్న ప్రభుత్వ ప్రాయోజిత పథకాలలో తెలివిగా పెట్టుబడి పెట్టాలని, సులభంగా డబ్బు వస్తుందని, సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ అకాడామీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ మాట్లాడుతూ 292 మంది శిక్షణదార్థులను(252 సివిల్, 40ఏఆర్)లను ఉద్దేశించి మాట్లాడుతూ ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని చెప్పారు. శిక్షణ పొందుతున్న వారిలో ఎక్కు మంది 56%-%60 సంవత్సరాల మధ్య వయస్సు వారిని గుర్తిస్తూ శిక్షణ కాలంలో వారి ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. శిక్షణ పొందుటకు వివిధ పోలీసుల జోన్లలో ముఖ్యంగా చార్మినార్ జోన్ నుంచి గణనీయమైన ప్రాతినిధ్యం 117 మంది వహించారన్నారు. మల్టీజోన్%-%1(142 మంది), మల్లీజోన్%-%2(150 మంది), ఈ శిక్షణలో ముగ్గురు మహిళా అధికారులు కూడా పాల్గొంటున్నారన్నారు. శిక్షణ సమయంలో వారికి ఇండోర్‌లో భాగంగా స్టేషన్ హౌస్ నిర్వహణ, క్రిమినల్ మేజర్ చట్టాలు, ప్రత్యేక, స్థానిక చట్టాలు, ఫోరెన్సిక్స్, నాయకత్వం, నిర్వహణ మొదలైనవి నేర్పుతారన్నారు. బహిరంగ శిక్షనలో భాగంగా వారికి యోగా, శారీరక శిక్షణ, కసరత్తులు, ఆయుధ శిక్షణ తదితరవాటిని నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మురళీధర్, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, డిఎస్‌పీలు, అకాడామీలోని ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




## మణికొండలో పండిత్ దీన్‌దయాల్ వర్ధంతి కార్యక్రమాలు



**గండిపేట్(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 57వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మణికొండలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు రవికాంత్‌రెడ్డి, జే.సిద్ధప్ప, సి.బీరప్ప, వందననాగేష్, జొన్నాడ లక్ష్మి, సి.హెచ్.ఇందిరా, అప్పల అనిత, దేవి, రేఖ, ఆనందరావు, బి.శివకుమార్, డి.రాజేష్, మధు, గణేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



## సిసిఆర్ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**జుక్కల్ క్రైమ్ మిర్రర్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు మంగళవారం సిసిఆర్ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ స్వచ్ఛంద సేవ సంస్థ చేస్తున్న కార్యక్రమాల్ని అభినందించారు.ప్రజలకు ఆర్టిఏ చట్టం యొక్క అవగాహన కల్పించడం,స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిసిఆర్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జాదవ్ వసంత్ పాటిల్ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంధంగూడలో మంచినీటి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన నిర్వహిస్తాం



**గండిపేట్(క్రైం మిర్రర్):** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ పరిధిలోని పలు కాలనీల వాసులు మంచినీటి సమస్యలను పరిష్కరించాలని జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. డంపింగ్ యార్డు పక్కనే ఉన్న ఇండస్ వ్యాలీ, సాయిబాలాజీనగర్, తిరుమల హిల్స్ కాలనీ, యాదయ్యనగర్ కాలనీ, కేకేనగర్%-%1, శాంతి ఎస్టేట్స్ కాలనీలోని చాలా ప్రాంతాలు గత పది సంవత్సరాలుగా మంచినీటి సమస్యలతో పొరాడుతున్నాయన్నారు. డంపింగ్ యార్డు వల్ల భూగర్భ జలాలు కలుషితం అవడం చేత కాలనీ వాసులందరూ కులాయి నీటి మీదనే ఆధారపడాల్సి వస్తుందన్నారు. పెరిగిన నీటి వినియోగం వల్ల సకాలంలో ఈ కాలనీ వాసులకు నీరు అందడం లేదన్నారు. మంచి నీరు కనీసం వారం రోజులకు ఒకసారి కూడా ఇవ్వడం లేదని కాలనీ వాసులు మేనేజర్ వద్ద వాపోయారు. ఈ నెల 20వ తేదీ వరకు సమస్యను పరిష్కరిస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. తమ సమస్య పరిష్కారం కాకపోతే ఈనెల 22వ తేదీన పెద్ద ఎత్తున ఆల్ కాలనీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు చౌరస్తాలో ధర్నా చేస్తామమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ పీసరి వినయ్‌రెడ్డి, తిరుమల హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్, ఇండస్ వ్యాలీ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, యాదయ్యనగర్ ప్రెసిడెంట్ నరసింహ, సాయి బాలాజీనగర్ ప్రెసిడెంట్ స్వరూప్‌రెడ్డి, రవి,శాంతి ఎస్టేట్స్ ప్రెసిడెంట్ రమణ, కేకేనగర్ నుంచి లుకమన్, వైజీఎస్ రెడ్డి, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి లో కబడ్డీ పోటీలు ప్రారంభించిన మాజీ జెడ్పిటిసి ఏవీ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండలం కేంద్రంలో రాధా రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళ వారం ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రామీణ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానిక మాజీ జడ్ పి టి సి ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి సంజీవరెడ్డి రాజు పాల్గొని మాట్లాడారు. క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు.



# రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకోని మంచినీటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

## భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు సీతారాం ధూళిపాళ



గండిపేట్(క్రైం మిర్రర్): మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న మంచినీటి సమస్యలను పరిష్కరించాలని భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు సీతారాం ధూళిపాళ కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఇప్పటి వరకు సేకరించిన డివిజన్ 18 జలమండలి అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు కాపీలను ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మణికొండ పురపాలక సంఘం పరిధిలో భూగర్భ జలాలు అడుగంటిన కారణంగా బోర్లు ఎండిపోవడం పురజనులంతా కేవలం జలమండలి సరఫరా చేసే నీటిమీద ఆధారపడడంతో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకోని ఇప్పటి నుంచే తగినన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేయాలన్నారు. నెమలినగర్‌లో స్థలం కేటాయించిన చోట 0.5 ఎంఎల్‌డి నిర్మించడం, గోల్కొండ హిల్స్ కాలనీ వారు రిజర్వాయర్ నిర్మించడం కోసం తగినంత స్థలం కేటాయించడం కోసం ముందుకు వచ్చిన కారణంగా ఆ స్థలంలో కూడా రిజర్వాయర్ నిర్మిస్తే చుట్టు పక్కల ఉన్న కాలనీలు అన్నింటికి మంచినీటి సదుపాయం కలుగుతుందన్నారు. ప్రస్తుతం నీటి కనెక్షన్ కోసం అర్జీ పెట్టుకోని సాంకేతిక కారణాల వల్ల జలమండలి వారు కనెక్షన్ ఇవ్వలేని కారణంగా వారికి టెంపరరీ క్యాన్ నెంబర్లు ఇవ్వాలన్నారు. కొన్ని గేటెడ్ కమ్యూనిటీలకు డిస్ట్రిబ్యూషన్ లైన్ వేయకుండా మెయిన్ లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చిన కారణంగా రాబోయే కాలంలో మణికొండ నివాసస్తులు మంచినీటి ఎద్దడి ఎదుర్కొనే అకకాశం ఉందన్నారు. దీని కారణంగా డిపార్ట్‌మెంట్‌కు ఆదాయ వనరుల్లో కోతపడుతుందని డిస్ట్రిబ్యూషన్ లైన్లు వేయాలని కోరారు. పంచవటి, ఇతర కాలనీలలో ఒక గంట సమయం నీటి సరఫరా చేయవలసి ఉండగా 40%-%45నిమిషాలు మాత్రమే మంచినీరు వస్తున్న కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇవే విషయాలను జలమండలి మేనేజర్‌కు విన్నవించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఏర్పుల శ్రీకాంత్, సంగం శ్రీకాంత్, గోరుకొంటి విఠల్, రామసుబ్బరెడ్డి, భానుచందర్, ఆరీఫ్‌మొహమ్మద్, బొడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఐటీలో జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ప్రారంభం

గండిపేట్(క్రైం మిర్రర్): మహాత్మగాంధీ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల ఆఫ్ ఇండియా కలిసి ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన క్రింద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఏఐ, ఎంఎల్‌లో పరిశ్రమ సంబంధిత నైపణ్యాలను అందించడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విజయవంతంగా కోర్సును పూర్తి చేసిన వారికి ఏఐ, ఎంఎల్ ఇంజనీర్లుగా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. సీఎస్ఈ, సీఎస్ఎం, సీఎస్‌డీ, ఐటీ, సీఎస్‌బీ విభాగాల నుంచి మొత్తం 90 మంది విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక ప్రోగ్రామ్ కోసం ఎంపికైయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, ఈఎస్‌సిఐ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు, ఎంజిఐటీ ప్రొఫెసర్ డాక్టర టి.వి.రజనీకాంత్, ఫ్యూచర్లీ ఇంక్ సహ స్థాపకుడు ప్రమోద్ చింతపేంట, ఎంజీఐటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మిస్ శాంతి కె.నుతలపాటి, ఈఎస్‌సీఐ నోడల్ ఆఫీసర్ సాయి కిషోర్‌లు పాల్గొన్నారు.

## సీఐ రాజశేఖర్ రెడ్డి కి అభినందనలు వెల్లువ




**కూకట్ పల్లి, ఫిబ్రవరి 11 (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ సిఐ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ రెడ్డిని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిడికిటి గోపాల్ చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి, పూల బొకేతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## కుష్టువ్యాధి నిర్ధారణ, నిర్మూలనకు సహకరించాలని




**గండిపేట్(క్రైం మిర్రర్):** కుష్టువ్యాధి నిర్ధారణ, నిర్మూలనకు ప్రజలు అందరూ సహకరించాలని శివరాం పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డి పి ఏం ఓ లింగ నాయక్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ గౌరీ తెలిపారు. మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో మార్కండేయ నగర్ ప్లాస్టిక్ కంపెనీ లో కార్మికులకు, స్థానికులకు ఆమె ఈ సందర్భంగా తెలియ చేస్తూ స్పర్శ లేని మచ్చలు కుష్టువ్యాధి కావచ్చు అనే అంశంపై కాలనీ ప్రజలకు మంగళవారం అవగాహన కల్పిం చారు. అదేవిదంగా వారిచే ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మైక్రో బ్యాక్టీరియాలెప్రే అనే క్రిమి వల్ల వచ్చే కుష్టువ్యాధి ఇతర అంటు వ్యాధుల్లాంటిదని, కుష్టువ్యాధి నిర్ధారణ అయ్యాక, చికిత్స సక్రమంగా తీసుకుంటే ఏ దశలో ఉన్నా పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. బహుళ ఔషధ చికిత్సతో పూర్తిగా నివారణపొంది, సామాజిక జీవనం గడపవచ్చని తెలిపారు.ఈ చికిత్స అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా లభిస్తాయని చెప్పారు. శరీరంపై పాలిపోయిన, ఎరుపు లేదా రాగి వర్ణంగల, స్పర్శ లేని మచ్చలుంటే మీ ఇంటి దగ్గరకు వచ్చి సర్వే నిర్వహిస్తున్న సామాజిక ఆశ కార్యకర్తలకు చెప్పి వ్యాధి నిర్ధారణలో సహకరించి, కుష్ఠ వ్యాధి రహిత సమాజానికి చేయూత నివ్వండని ప్రజలను కోరారు. అదేవిదంగా వ్యాధిని ఆరంభ దశలో గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, మార్కండేయ నగర్ ఆశవర్కర్ మంగ పాల్గొన్నారు.

# కోవలెంట్ పరిశ్రమ అక్రమ నిర్మాణాలను ఆపాలంటూ ఆందోళన

### 100 టన్నుల బాయిలర్ నిర్మాణం కోసం కొత్తగా వాటర్ లైన్

### కాలుష్యం వల్ల ప్రజలు శ్వాసకోశవ్యాధులు, ఎలర్జీ, అస్తమా, గుండె జబ్బులు తొ సతమతం



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఫిబ్రవరి 11 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్ల మాచనూర్ గ్రామంలోని కోలెంట్ పరిశ్రమ ద్వారా వెలువడుతున్న కాలుష్యంతో గ్రామ ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని ప్రజలకు శ్వాసకోశవాదులు, ఎలర్జీ, అస్తమా, గుండె జబ్బులు తదితర వ్యాధులు వస్తున్నాయని, గ్రామ ప్రజలకు కాకుండా గ్రామ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినిలకు కూడా అనేక రకాల రోగాలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం 100 టన్నుల బాయిలర్ నిర్మాణం కోసం కొత్తగా వాటర్ లైన్ నక్క వాగు నుండి తీసుకురావడం కోసం నిర్మాణ పనులు కొనసాగిస్తుండగా గ్రామస్తులు రాత్రికి రాత్రి ఆపివేశారని తెలిసింది. గ్రామస్తులకు తెలవకుండా రాత్రికి రాత్రి కొత్త లైన్ నిర్మాణం చేసి కంపెనీ నుండి వ్యర్థ జలాలు బయటకు వదలడానికి నిర్మాణం చేపడుతున్నారని వారు తెలిపారు. గతంలోనే భారీ పైప్ లైన్ ద్వారా నక్కవాగునుండి కంపెనీ అవసరాల కోసం నీరు తీసుకున్నారని, మళ్లీ ఎలాంటి పర్మిషన్ లేకుండా పైప్ లైన్ వేయడంతో గ్రామస్తులు నిలుపుదల చేయడం జరిగింది. ఇదే కాకుండా ఏలాంటి అనుమతులు లేకుండా కొత్తగా పరిశ్రమ నిర్మాణం చేస్తున్నారని, ఇదే కాకుండా చెరువులు నుండి వచ్చే కట్టు కాలువ ను కూడా పూడ్చి వేస్తున్నారని తెలిపారు. అరబిందో కోలెంట్ తదితర కంపెనీల ద్వారా వచ్చే కాలుష్యం ద్వారా గుండ్ల మాచనూరు గ్రామంలో ప్రజలు కాలుష్యాన్ని పిల్చి నానారకాల వ్యాధులకు గురవుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. ఇప్పుడు నిర్మాణము చేపడుతున్న 100 టన్నుల బాయిలర్ ప్రారంభమైతే గ్రామంలో ప్రతి మనిషి కాలుష్యం పీల్చి, డస్టుతో అనేక రకాల వ్యాధుల బారినపడే అవకాశం ఉందని ఈ వంద టన్నుల బాయిలర్ ను కూడా నిలుపుదల చేసి గుండ్ల మాచునూరు ప్రజలను ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### నార్సింగి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఉషారాణి



గండిపేట్(క్రైం మిర్రర్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నార్సింగి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఉషారాణి వెల్లడించారు. సూర్య పొదుపు సంఘం, లక్ష్మి పొదుపు సంఘాల డ్వాక్రా మహిళలు మంగళవారం కౌన్సిలర్ ఉషారాణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను పొంది వాటిని సద్వినియోగం చేసుకోని రాణించాలన్నారు. మహిళల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పి విజయలక్ష్మి డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



## ప్రేమావతిపేట్‌లోని పార్కులో జరుగుతున్న సుందరీకరణ పనులను సందర్శించి పరిశీలించిన నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రేమావతిపేట్‌లోని పార్కును మంగళవారం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ప్రేమావపతిపేట్‌లో 14 లక్ష రూపాయలతో ఒక సంవత్సరం మెయింటెనెన్స్‌తో కూడిన నూతనంగా నిర్మిస్తున్న పార్క్ సుందరీకరణ పనులను ప్రేమావతిపేట్‌కాలనీ పార్క్ అర్బన్ బయోడైవర్సిటీ సెక్షన్ రాజేంద్రనగర్ సర్కిల్ మేనేజర్ వి.అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్, ఆర్టికల్చర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏ లోటుపాట్లు లేకుండా సుందరీకరణ పనులను మెరుగు దిద్దాలని ప్రజలకు అనుకూలవిధంగా పనులు చేయాలని అధికారులకు సూచించారు. పనుల అనంతరం మెయింటినెన్స్ కూడా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌సాగర్, సురేష్, శ్రీకాంత్‌రెడ్డి, తలారి చిన్న, అనిల్, రామ్మోహన్, శివప్రసాద్, దేవా, మనోజ్, శంకర్‌రెడ్డి, రఘునాథ ఈశ్వర్, బాలరాజ్, ఆనంద్, బాల్‌రెడ్డి, యాదయ్య, గోపి, మూర్తి, శ్రీనివాస్ తదితరులున్నారు.



## బీజేఎంసీలో రోడ్డు ఆక్రమణలపై కన్నెర్ర చేసిన మున్సిపల్ కార్పోరేషన్ సిబ్బంది

### కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర




**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్ పాత్ల ఆక్రమణలను సహించేది లేదని కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. ఈ మేరకు ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులుపించారు. ఫుట్పాత్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన నిర్మాణాలపై జెసిబి బుల్లోజర్లతో అధికారులు కూల్చివేశారు. వ్యాపార సముదాయాల మెట్లను సైతం ధ్వంసం చేయడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేఎంసీ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. పేద ప్రజల జీవనోపాధిని సైతం చిదిమేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. షాపుల యజమానులు సైతం రోడ్ల మీదికి వచ్చే పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ఈ సందర్భంగా బాధితులతో కలిసి నిరసన నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చిరు వ్యాపారులకు తమ అండగా ఉంటామని అన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మాత్తుగా ధ్వంసం చేయడం ఏంటని ప్రశ్నించారు. దీంతో వారు జీవనోపాధిని కోల్పోయే అవకాశం ఉందని అన్నారు. వందల మంది పోలీసులను పెట్టి కూల్చివేతలు చేపట్టడం దారుణమని అన్నారు. వ్యాపారులకు నష్టపరిహారం, పునరావాసం, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని వారి కుటుంబాలతో కలిసి ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, బీజేఎంసీ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బి రాముడు యాదవ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య చట్టాలను ఉల్లంఘిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్...!



**జగిత్యాల బ్యూరో ముస్తాఫా (క్రైమ్ మిర్రర్):** విద్యాశాఖ అధికారి కలసి వినతి పత్రం ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ మరియు ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు దుమల గంగారాం మాదిగ జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ శివారు లో గల శ్రీ చైతన్య హై స్కూల్ లో 6వ తరగతి చదువుతున్న దళిత విద్యార్థినిపై "గుడ్ టచ్ - బాడ్ టచ్" పేరిట గత కొంత కాలంగా నిత్యం వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ లో పేరెంట్స్ ఫిర్యాదు చేయగా నిందితుడుపై.ఫోక్సో , ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.గత కొంత కాలంగా జరుగుతున్న ఈ వేధింపుల విషయం పాఠశాల కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి దృష్టికి, అతని కుమారుడు క్యాతం గోవర్ధన్ దృష్టికి, ప్రిన్సిపాల్ దృష్టికి వెళ్ళినా పట్టించు కోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరిగిందనీ తెలిసింది.అంతే కాకుండా ఈ పాఠశాలపై అనేక ఆరోపణలు ఉన్నాయి.ఈ మధ్య కాలంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీల లో కూడా పురుగులు పడ్డ వంట సామగ్రి బయట పడ్డది.ఇదే పాఠశాల భవనం నిర్మాణ సమయంలోనే వాచ్ మెన్ హత్యకు గురికాగా ప్రమాదం జరిగిందని తప్పుడు సమాచారంతో ఇదే జగిత్యాల రూరల్ పోలీసులను మచ్చిక చేసుకొని కేసు నుండి బయట పడినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇదే పాఠశాల కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి గతంలో జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ళ బావి చౌరస్తా సమీపంలో నిజామాబాద్ రోడ్డు యందు "కారు ఆక్సిడెంట్" పేరుతో ఒకరి ప్రాణాలను కూడా బలిగొన్నారు. ఈ పాఠశాల కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి, అతని కుమారుడు క్యాతం గోవర్ధన్ రెడ్డి లు ఇద్దరిపై కూడా అనేక రకాల ఆరోపణలు ఉన్నాయి. వీరిద్దరూ నిరుపేదలను, మహిళా టీచర్స్ ను, మహిళా పేరెంట్స్ ను వేధిస్తారు అనే ఆరోపణలు కూడా కోకొల్లలుగా ఉన్నాయి. కేవలం దోపిడియే ధ్యేయంగా, సంపాదనే లక్ష్యంగా నాణ్యత లేని విద్య తో %జదీూజు% స్కూల్ అని, సీబీస్ఈ సిలబస్ అని, కాన్సెప్ట్ స్కూల్ అని, ఐఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ విద్య అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తూ పిల్లల తల్లిదండ్రుల ద్వారా అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. నాలుగైదు బ్రాంచీలు ఏర్పాటు చేసుకొని పిల్లల తల్లిదండ్రులను ఆకట్టు కునేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తూ, సుమారు 30 కిలోమీటర్ల దూరం నుండి నిత్యం ఉదయం 6-00 గంటలకే చిన్న పిల్లలను స్కూల్ బస్ లలో సామర్థ్యానికి మించి తీసుకు వస్తూ "బాలల హక్కులను" కూడా కాల రాస్తున్నారు. అధిక లోడ్ తో విద్యార్థులను స్కూల్ బస్ లలో తరలిస్తూ %=నూ% నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. చాలీ - చాలని జీతాలు ఇస్తూ టీచర్లను, డ్రైవర్లను, క్లీనర్లను, ఆయాలను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారు. కావున వెంటనే శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేతలు అయిన కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి, డైరెక్టర్ క్యాతం గోవర్ధన్ రెడ్డి లపై పలు ఆరోపణలు శ్రమ దోపిడీ, ఫీజుల దోపిడీల కింద కేసులు నమోదు చేయించి చట్ట పరంగా తగు కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మా విజ్ఞప్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్ మాదిగ ఎంఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నక్క రమేష్ మాదిగ ఎమ్మార్పీఎస్.జిల్లా కార్యదర్శి సంగేపు ముత్తు మాదిగ జగిత్యాల నియోజకవర్గం కో కన్వీనర్. పోడేటి సునీల్ మాదిగ అర్బన్ మండల అధ్యక్షులు బాపురపు గంగారం మాదిగ జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి దుమల. రమేష్ మాదిగ.





## అల్కాపూర్ మహాత్మాగాంధీ పార్కులో మరమ్మత్తులు

**గండిపేట్(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ టౌన్‌షిప్ మహాత్మాగాంధీ పార్కులో మరమ్మత్తు పనులను చేపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసే కాలనీ వాసులకు, పార్కులో వాకింగ్ చేసే వారికి గత కొంతకాలంగా చిన్న చిన్న గులకరాళ్లు తేలడంతో పాదాచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు.ఈ సమస్యను కాలనీ వాసులు మణికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆలస్యంనవీన్‌కుమార్ దృష్టికి తీసుకురావడంతో ఆయన కమీషనర్ ప్రదీప్‌కుమార్ సహకారంతో పార్కులోని వాకింగ్ ట్రాక్ మరమ్మత్తులు చేయాలని కోరారు. ఈ మేరకు చదును చేసి మరమ్మత్తులు పూర్తి చేసి ప్రలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మణికొండ మాజీ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కాలనీ వాసులు పాల్గొని సమస్య పరిష్కారానికి కృషి చేసిన మాజీ కౌన్సిలర్ నవీన్‌కుమార్‌ను అభినందించారు.

# పేద ప్రజలను రోడ్డుకు తేవడమే కాంగ్రెస్ ఉద్దేశం

### అధికారులు సైతం దీనికి వత్తాసు పలుకుతున్నారు

### ఫుట్‌పాత్‌ల అక్రమణల నేపంతో వ్యాపారుల షాపులను సైతం ధ్వంసం చేస్తున్నారు

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావులకోళ్లనాగరాజు





**గండిపేట్(క్రైం మిర్రర్):** పేద ప్రజలను రోడ్డుపైకి తేవడమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశంగా ఉందని, దీనిని అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావులకోళ్లనాగరాజు అన్నారు. మంగళవారం అప్పా చౌరస్తా నుంచి టిప్పుఖాన్ బ్రిడ్జీ వరకు జరుగుతున్న తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారిపై పుట్‌పాత్‌ల అక్రమ నిర్మాణాలను తొలిస్తున్నామనే నెప్పంతో ప్రజలను రోడ్డుకు ఈడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేవారు. ఆయన మాట్లాడుతూ పేదల షాపులను జెసిబి లతో బుల్డోజర్లతో కూల్చివేయటము ఏమిటని ప్రశ్నించారు వ్యాపార సముదాయాల ప్రధానమైనటువంటి మెట్లను ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు, షాపులోకి ఏ విధంగా వెళ్తారని కమిషనర్ని ప్రశ్నించారు, ఈ సందర్భంగా పోలీసులకు బి ఆర్ ఎస్ నాయకులకు వాగ్వాదం జరిగింది, చిరు వ్యాపారులకు అండగా ఉంటామని వ్యాపారస్తులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా వారి వస్తువులను ధ్వంసం చేయడమేమిటని ప్రశ్నించారు, దీనిపైనే వారి జీవనోపాధి ఉండేదని, వారిని రోడ్డుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు, ఆర మైసమ్మ దేవాలయం గుడికి వచ్చే భక్తులకు కొబ్బరికాయలు పూలదండలు వ్యాపారం చేసుకునే కొన్ని వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు, వారికి పునరావాసం కల్పించాలని నష్టపోయిన వారందరికీ నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వ అధికారులకు సూచించారు.. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలకు పాల్పడుతున్నారని. వందల మంది పోలీసులను పెట్టి కూల్చివేత్తలు చేపట్టడం దారుణమని బాధితులకు నష్టపరిహారము మరియు పునరావాసం ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయకపోతే వారి కుటుంబాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి , బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ బి ఆర్ ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ వి. రాముడు యాదవ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేఎంసీ 18 వ వార్డు ఓంనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

### పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్ గౌడ్



**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 18 వ వార్డు ఓంనగర్ కాలనీలో ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయడం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్ గౌడ్ అన్నారు. మంగళవారం సీసీ రోడ్డు పనులను స్టార్ట్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మంచినీరు, రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.





## ఏసీబీ ట్రాప్‌లో ధారూర్ ఎస్సై...!

**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** ఓ కేసు విషయంలో ధారూర్ ఎస్సై లంచం తీసుకుంటూ ఏసిబీ అధికారులకు చిక్కిన సంఘటన మంగళవారం రాత్రి వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్ లో చోటుచేసుకుంది.ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి.ధారూర్ మండలం నాగ సముందర్ గ్రామానికి చెందిన ఓ కేసు విషయంలో ఫెవర్ చేయండంతో పాటు ఒక్కరి పేరును కేసులో నుండి తొలగించడానికి ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ రూ.30 వేలు డిమాండ్ చేసినట్లు తెలుస్తుంది.దీనిలో భాగంగా మంగళవారం ఎస్సై వేణుగోపాల్ గౌడ్ వాహన డ్రైవర్ బీరప్ప రూ.30 వేలు తీసుకొని తన పాయింట్ జేబులో పెట్టుకున్నాడు.ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్ ప్రకారం రైడ్ చేసి డ్రైవర్ బీరప్ప అనే వ్యక్తిని కెమికల్ టెస్టులు నిర్వహించగా నిర్ధారణ అయింది.ఈ మేరకు ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ ను ఎ -2గా, డ్రైవర్ బీరప్పను ఎ-1గా అదుపులోకి తీసుకొని నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసిపి అధికారులు తెలిపారు.ధారూర్ ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ గతంలో తాండూరు పట్టణ ఎస్ఐగా పనిచేశారు.

## స్థానిక ఎన్నికలలో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలి..!!

### యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్

**చౌటుప్పల్ ఫిబ్రవరి 11, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి):** రానున్న స్థానిక ఎన్నికల సందర్భంగా అంకిరెడ్డిగూడెం గ్రామంలో యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో యువకులు కీలక పాత్ర పోషించాలని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడప గడపకు చేర్చే బాధ్యత ప్రతి ఒక్క యువకుడి మీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్, మునుగోడు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచరకుంట్ల రాంరెడ్డి, చౌటుప్పల మండలం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముప్పిడి కృష్ణ చైతన్య గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మన సాయికుమార్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు నరేష్, సిద్ధూ, బిట్టు, లల్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
బిజినెస్

బుధవారం
12-2-2025



# ఇవన్నీ ఉంటేనే ఇల్లు కొంటాం..

### ఉద్యోగస్తుల కోసం వర్క్ ఫ్రం హోమ్ స్పేస్
### పార్కింగ్‌లో ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు
### పిల్లల కోసం స్టడీ, డిజిటల్ క్లాస్ రూమ్
### టెర్రస్, క్లబ్‌హౌస్‌పై సౌర విద్యుత్ సౌకర్యం
### పెంపుడు జంతువుల కోసం పెట్‌పార్క్

నివాస సముదాయాల్లో అన్ని వసతులు ఉండాల్సిందే.. ఆ విషయంలో మాత్రం అస్సలు తగ్గేదే లే అంటున్నారు కొనుగోలుదారులు.. గతంలో కమ్యూనిటీలలో జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి నాలుగైదు వసతులు ఉంటే సరిపోయేది. కానీ.. ప్రస్తుతం భవిష్యత్తు అవసరాలతో పాటు అభిరుచులకు తగ్గట్టుగా వసతులు ఉండాల్సిందే. ఇంటి నుంచి పని కోసం కో%-%వర్కింగ్ స్పేస్, ఆన్‌లైన్ క్లాస్‌ల కోసం డిజిటల్ క్లాస్ రూమ్ నుంచి మొదలుపెడితే.. టెర్రస్, క్లబ్‌హౌస్‌పై సౌర విద్యుత్ ఏర్పాట్లు, ఔట్‌డోర్ జిమ్, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్, హోమ్ థియేటర్, ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు, పెట్‌పార్క్, గోల్ఫ్‌కోర్స్ వరకూ అన్ని ఆధునిక వసతులు కావాలని గృహ కొనుగోలుదారులు భావిస్తున్నారు.

**పెట్ పార్క్, స్పా..**

జంతు ప్రేమికుల కోసం కూడా డెవలపర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నివాస సముదాయాల్లో వసతుల జాబితాలో పెట్ పార్కులు కూడా చేరిపోయాయి. గేటెడ్ కమ్యూనిటీలలో కొనుగోలుదారులు పెంచుకునే పెంపుడు జంతువుల కోసం పెట్‌పార్క్, క్లబ్‌హౌస్‌లో పెట్ స్పాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు పెంపుడు జంతువుల ఆహార ఉత్పత్తులు, శిక్షకులు, వ్యాయామ ఉపకరణాలు వంటివి ఆయా ప్రాజెక్ట్‌లలో అందుబాటులో ఉంటాయి.

**సోలార్, హోమ్ గార్డెనింగ్**

సొంతిల్లు కొనుగోలు చేసే క్రమంలో గేటెడ్ కమ్యూనిటీలో కామన్ ఏరియాలు ఎంత వరకు ఉన్నాయో అడిగి మరీ తెలుసుకుంటున్నారు. గతంలో కామన్ ఎలివేటర్, కామన్ కారిడార్, గ్యారేజ్, స్టేర్‌కేస్ ఉండేవి ఇప్పుడు వాటిని ప్రైవేట్ కావాలని అడుగుతున్నారు. ఇంట్లో సొంత అవసరాల కోసం కమ్యూనిటీ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చిన్నపాటి స్థలంలో ఆకు కూరలు, కూరగాయలు పండించుకునేలా వర్టికల్ గార్డెనింగ్, బాల్కనీలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వారాంతాల్లో కమ్యూనిటీ వాసులతో ఆహ్లాదంగా గడిపేందుకు ఔట్‌డోర్ కిచెన్, డైనింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నారు. టెర్రస్, క్లబ్‌హౌస్‌పై సౌర విద్యుత్ ఏర్పాటు చేస్తున్నారు. వీధి దీపాలు, ఇతరత్రా అవసరాల కోసం ఈ విద్యుత్‌నే వినియోగిస్తున్నారు. దీంతో నివాసిత సంఘానికి కరెంట్ బిల్లు భారం తగ్గుతుంది.

**ఈవీ చార్జింగ్ స్టేషన్లు**

పెట్రోల్, డీజిల్ వంటి వాహనాలతో పర్యావరణం కాలుష్యం అవుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వాహన కొనుగోళ్లపై రాయితీలు అందిస్తుండటంతో పాటు చార్జింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేస్తున్నాయి. డెవలపర్లు కూడా నివాస, వాణిజ్య సముదాయాల నిర్మాణంలో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. నగరానికి చెందిన మైహోమ్, రాజపుష్ప, ప్రణీత్ గ్రూప్, పౌలోమి ఎస్టేట్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలు కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా వసతులను కల్పిస్తున్నారు.



**వసతులు ఇలా..**

నివాస సముదాయంలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు, ప్రతి పార్కింగ్ ప్లేస్ వద్ద చార్జింగ్ పెట్టుకునేందుకు వీలుగా పాయింట్లను ఇస్తున్నారు.

జంతు ప్రేమికుల కోసం నివాస సముదాయంలోనే పెట్‌పార్క్, క్లబ్‌హౌస్‌లో పెట్ స్పాలను ఏర్పాటు చేస్తున్నారు. పెంపుడు జంతువుల ఆహార ఉత్పత్తులు, శిక్షకులు, వ్యాయామ ఉపకరణాలు వంటివి ఆయా ప్రాజెక్ట్‌లలో అందుబాటులో ఉంటాయి.

రిచ్‌మ్యాన్ గేమ్‌గా పిలిచే గోల్ఫ్ కూడా వసతుల జాబితాలో చేరిపోయింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో జిమ్ చేయాలని అందరూ భావిస్తున్నారు. దీంతో ఇండోర్ జిమ్‌లు కాస్త ఔట్‌డోర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఓజోనైజ్డ్ మెడిటేషన్ హాల్, ఉష్ణోగ్రత నియంత్రణ స్విమ్మింగ్ పూల్స్ వచ్చేశాయి.వైద్య అవసరాల కోసం మినీ ఆస్పత్రి, మెడికల్ షాపు, అంబులెన్స్, పారా మెడికల్ సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో మాదిరిగా సినిమాలకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో నివాస సముదాయంలోనే మల్టీప్లెక్స్ అనుభూతి కలిగేలా స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్స్‌ను డెవలపర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా డిజిటల్ క్లాస్ రూమ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.





## ముంబైలో ఆఫీస్ కొన్న సన్నీ లియోన్

సినీతారలు, క్రికెటర్స్ లేదా పారిశ్రామిక వేత్తలు చాలామంది ఎప్పటికప్పుడు ఖరీదైన వాహనాలు, ప్లాట్స్ వంటివి కొనుగోలు చేస్తూ ఉంటారు. ఇప్పటికే చాలామంది ముంబై వంటి అభివృద్ధి చెందిన నగరాల్లో ఆస్తులను కొనుగోలు చేశారు. తాజాగా ఈ జాబితాలోకి నటి 'సన్నీ లియోన్' (%ూబఅఅఎ ూవశీఅవ%) కూడా చేరింది. కోట్ల రూపాయలు వెచ్చించి ఓ కమర్షియల్ బిల్డింగ్ కొనుగోలు చేసింది.బర్త్ డే సాంగ్స్‌కు కేర్ ఆఫ్ అడ్రస్‌గా పాపులర్ అయిన సన్నీ లియోన్.. ముంబైలోని ఓషివారాలో రూ. 8 కోట్లకు ఆఫీస్ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు స్క్వేర్ యార్డ్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ వెల్లడించింది. ఇక్కడే ఆమె తన కార్యకలాపాలను కొనసాగించే అవకాశం ఉంది.బిగ్ బి, అజయ్ దేవగన్, కార్తీక్ ఆర్యన్ కార్యాలయాలు ఉన్న భవనంలోనే సన్నీ లియోన్ కార్యాలయాన్ని కొనుగోలు చేసింది. ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం.. కొనుగోలుకు సంబంధించిన లావాదేవీ ఫిబ్రవరి 2025లో జరిగినట్లు సమాచారం.సన్నీ లియోన్ ఆస్తిని.. ఆనంద్ కమల్నాయన్ పండిట్ %ు% రూపా ఆనంద్ పండిట్ యాజమాన్యంలోని ఐశ్వర్య ప్రాపర్టీ అండ్ ఎస్టేట్స్ నుంచి కొనుగోలు చేసింది. ఆనంద్ పండిట్.. టోటల్ ధమాల్, చెహ్రే మరియు ది బిగ్ బుల్ వంటి చిత్రాలను నిర్మించారు.సన్నీ లియోన్ కొనుగోలు చేసిన ఆఫీస్ స్థలంలో 176.98 చదరపు మీటర్ల (1,904.91 చదరపు అడుగులు) కార్పెట్ ఏరియా, 194.67 చదరపు మీటర్ల (2,095 చదరపు అడుగులు) బిల్ట్ అప్ ఏరియా వంటివి ఉన్నాయి. అంతే కాకుండా ఇందులో మూడు కార్ పార్కింగ్ స్థలాలు కూడా ఉన్నాయి. ఈ లావాదేవీకి రూ. 35.01 లక్షల స్టాంప్ డ్యూటీ చెల్లింపు, మరో రూ. 30,000 రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సి వచ్చింది.

## ఆటోకి మూడు చక్రాలే ఎందుకు?.. కారణం తెలుసా!

దశాబ్దాల చరిత్ర ఉన్న.. ఆటో రిక్షా ఎన్ని అప్డేట్స్ పొందినా మూడు చక్రాలతోనే వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే కాకుండా.. పట్టణ ప్రాంతాల్లో కూడా విరివిగా అందుబాటులో ఉన్న ఆటోలకు ఇతర వాహనాలకు మాదిరిగా ఎందుకు నాలుగు చక్రాలు ఉండవు?, మూడు చక్రాలు ఉండటానికి కారణం ఏమిటి అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

**బ్యాలెన్స్ చేయడం సులభం**

నాలుగు చక్రాల వాహనాల కంటే.. మూడు చక్రాల వాహనాలను బ్యాలెన్స్ చేయడం కొంత సులభం అని ఓ ఐఐటీ ప్రొఫెసర్ వివరించారు. అంతే కాకుండా.. దీనిని రూపొందించడానికి అయ్యే ఖర్చు కూడా తక్కువని అన్నారు.ఖర్చు మాత్రమే కాకుండా.. ఇంజినీరింగ్ వర్క్ కూడా తక్కువే. నాలుగు చక్రాల వాహనం కన్నా మూడు చక్రాల వాహనం చిన్నదిగా రూపొందుతుంది. అలాంటప్పుడు ఎటువంటి ఇరుకు ప్రాంతంలో ప్రయాణించడానికైనా, కొద్దిపాటి ప్రాంతంలో పార్క్ చేయడానికైనా అనువుగా ఉంటుంది. ఎప్పుడూ రద్దీగా ఉండే పట్టణాల్లో ఆటోలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. మూడు చక్రాల వాహనం వలన ఇంధన వినియోగం కూడా భారీగా అవదు. ఆటోను నడిపించేందుకు ఇంజనుకు తక్కువ శక్తి సరిపోతుంది. కాబట్టి ఆటోలను నడిపేవారు కూడా దీని నిర్వహణకు ఎక్కువ ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. మొత్తం మీద ఈ కారణాల వల్లనే ఆటో మూడు చక్రాలను మాత్రమే కలిగి ఉంటుంది.






## సాయంత్రంలోపు క్యాంపస్‌ను వీడండి.. ట్రైనీలకు ఇన్ఫోసిస్ అల్టిమేటం..!

దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. రెండేళ్ల క్రితం ఫ్రెషర్ల పట్ల కఠిన వైఖరిని ప్రదర్శించిన ఇన్ఫీ.. గతేడాది వారిని విధుల్లోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, తాజాగా అందులోని కొందరు ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న దాదాపు 400 మంది ట్రైనీలకు లేఆఫ్‌లు ఇచ్చేందుకు రెడీ అయినట్లు జాతీయ మీడియా పేర్కొంది. వరుసగా మూడు సార్లు అంచనా పరీక్షల్లో విఫలమైన కారణంగా వారిని తొలగిస్తున్నట్లు తెలిసింది.ట్రైనీలను 50 మందితో కూడిన బ్యాచ్‌లుగా పిలిచి వారితో మ్యూచువల్ సెపరేషన్ లెటర్లపై సంతకాలు చేయిస్తున్నట్లు సమాచారం. ఇవాళ సాయంత్రం 6 గంటల్లోపు ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది. అయితే, ట్రైనీల తొలగింపుపై ఇన్ఫీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. లేఆఫ్‌లకు గురైన ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు జాతీయ మీడియా నివేదించింది. తాము ఫెయిల్ అవ్వాలనే పరీక్షలను చాలా కఠినంగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు తమ భవిష్యత్తు కష్టంగా మారిందంటూ వాపోతున్నారు.

## మార్కెట్లోకి కేటీఎం నయా బైకులు

**ప్రారంభ ధర రూ.2.6 లక్షలు**

ప్రపంచంలో ప్రీమి యం మోటర్‌సైకిళ్ల తయారీలో అగ్రగామి సంస్థ కేటీఎం ఒకేసారి మరో మూడు బైకులను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2025 ఏడాదికిగాను విడుదల చేసిన కేటీఎం 250 అడ్వెంచర్ ధర రూ.2,59, 850, అలాగే కేటీఎం 390 అడ్వెంచర్ ఎక్స్ మోడల్ ధర రూ.2,91,140, కేటీఎం 390 అడ్వెంచర్ రూ. 3,67,699 ధరలు గా నిర్ణయించింది.ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సం బంధించినవి. 399 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైక్ 46 పీఎస్‌ల శక్తినివ్వనున్నది. వీటిలో కేటీఎం అడ్వెంచర్ బైకులు దేశీయ షోరూంలో లభించనుండగా, కేటీఎం 390 త్వరలో అందుబాటులోకి రానున్నది.



## అంతర్జాతీయ ప్రభావంతో తీవ్ర ఒడిదుడుకులు

**భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

ముంబయి, (క్రైమ్ మిర్రర్): దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోమారు నేలచూపులు చూడడంతో భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల నేపథ్యంలో వరుసగా ఐదో రోజూ సూచీలు భారీ నష్టాలు ఎదుర్కొన్నాయి. స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం టారిఫ్ విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులూ ఉండవన్న ప్రకటనలు వాణిజ్య యుద్ధ భయాలను తీవ్రతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో సైతం అమ్మకాలు వెల్లువెత్తాయి. ఓ దశలో సెన్సెక్స్ 1200 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23వేల దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,384.98 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత నష్టాల్లోకి వెళ్లింది. ఉదయం ఓ మోస్తరు నష్టాల్లో ట్రేడయిన సెన్సెక్స్.. మధ్యాహ్నం తర్వాత భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,030.59 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1018.20 పాయింట్ల నష్టంతో 76,293.60 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 22,986.65 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 309.80 పాయింట్ల నష్టంతో 23,071.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 60 పైసలు మేర బలపడి 86.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. జొమాటో, టాటా స్టీల్, టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎల్‌అండ్‌టీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.9 లక్షల కోట్లు ఆవిరై రూ.408 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2932 డాలర్ల వద్ద కొనసాగుతోంది.





## మాఘపౌర్ణమితో కుంభమేళాలో ట్రాఫిక్ ఆంక్షలు

**నో వెహికిల్జోన్‌గా ప్రకటన..కఠిన నిబంధనలు అమలు**

**రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తుల రాకపై సిఎం సమీక్ష**

ప్రయాగరాజ్, (క్రైమ్ మిర్రర్): మాఘ పూర్ణిమతో పాటు కొన్ని రోజుల్లో కుంభమేళా పూర్తికానున్న నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు భారీగా భక్తులు తరలిరానున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఆ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దానిని దృష్టిలో ఉంచుకొని మాఘ పూర్ణిమ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా యూపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఒకరోజు ముందు నుంచే మంగళవారమే ఆంక్షలు విధించారు. ఇప్పటికే గత వారాంతం ఎఫెక్ట్‌తో 350 కి.మీ. దూరం వరకు వాహనాలు నిలిచిన సంగతి తెలిసిందే. వీటన్నింటిని దృష్టిలోపెట్టుకొని అధికారులు కొత్త ఆంక్షలను అమల్లోకి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం 4 గంటల నుంచి కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా మార్పు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రయాగ్‌రాజ్ మొత్తాన్ని నో వెహికల్ జోన్‌గా మారుస్తామని వెల్లడించారు. శని, ఆదివారాల్లో లక్షల మంది కుంభమేళా యాత్రికులు ఏకంగా 24 గంటలకు పైగా రహదారి పైనే వాహనంలో ఉండిపోవాల్సి వచ్చింది. జబల్‌పూర్-ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఘటన ప్రపంచంలోనే అతి పొడవైన ట్రాఫిక్ జామ్‌గా చరిత్ర పుటలకు ఎక్కింది. మరో 48 గంటల పాటు ఎవరూ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లొద్దని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ట్రాఫిక్ పరిస్థితులను గూగుల్‌లో చూసుకుంటూ ముందుకుసాగాలన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, సివనీ, కట్నీ, మైహర్, సాత్నా, రివా జిల్లాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. 50 కి.మీ. మేర దూరం వెళ్లడానికే 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి సోమవారం రాత్రి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పోలీసులు, అధికారులు సమావేశమయ్యారు. 'రోడ్లపై వాహనాలు భారీగా చేరకుండా చూడాలి. రద్దీ లేకుండా చూసుకోవాలి. పార్కింగ్ ప్రాంతాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశాలు ఇచ్చారు.

## ఏపీ లిక్కర్ స్కాం 20 వేల కోట్లు

**పార్లమెంటులో వైకాపా అవినీతిని ప్రస్తావించా**

**సిబిఐ విచారణకు డిమాండ్ చేశా**

**టీడీపీ ఎంపీ సానా సతీష్ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): ఢిల్లీ లిక్కర్ స్కాం 2 వేల కోట్లు అయితే ఏపీ లిక్కర్ స్కాం 20 వేల కోట్లు అని టీడీపీ ఎంపీ సానా సతీష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరినట్లు తెలిపారు. విచారణలో అన్ని తేలుతాయని అన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి అక్రమాలపై పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు టీడీపీ ఎంపీ సానా సతీష్ తెలిపారు. వారు చేసిన అటవీ భూముల అక్రమాలు, అక్రమ మైనింగ్, లిక్కర్ స్కాంకు సంబంధించిన అంశాలను పార్లమెంట్‌లో చెప్పానన్నారు. స్టీల్ ఎ÷-లాంట్ అంశంపై ఏనాడు వైసీపీ నేతలు మాట్లాడలేదని, 7 నెలల్లో రాష్ట్రానికి ఎన్నో నిధులు తీసుకొచ్చామని, స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణ జరగదని లేదని స్టీల్ కేంద్ర మంత్రి స్పష్టం చేశారన్నారు. ఈ క్రమంలోనే పోలవరంపై వైసీపీకి ఎంత చిత్తశుద్ధి ఉందో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం పోలవరం మొదటి ఫేస్‌లో 41 మీటర్లు నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు.వైసీపీ నేతలు కేసులు నుంచి తప్పించుకోవడం కోసం ఇవన్నీ మాట్లాడుతున్నారని, వైసీపీ ఎంపీలు తమ వెంట నడవాల్సిన అవసరం లేదని సూచించారు. మిథున్ రెడ్డి, ఇతరులు నేరం రుజువైతే శిక్ష అనుభవించాల్సిందేనని, రాజకీయ కక్ష సాధింపు దిగితే ఇప్పటికే అరెస్టు అయ్యేవారని చెప్పుకొచ్చారు.

## జగన్ లిక్కర్ స్కామ్‌పై విచారణ జరపాలి

**లోక్‌సభలో ఎంపి సిఎం రమేశ్ ప్రస్తావన**

న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన లిక్కర్ స్కామ్‌పై విచారణ జరపాలని అనకాపల్లి భాజపా ఎంపీ సీఎం రమేశ్ డిమాండ్ చేశారు. మద్యం అంశంపై లోక్‌సభ జీరో అవర్‌లో సీఎం రమేశ్ ప్రస్తావించారు. వైకాపా హయాంలో ఢిల్లీని మించిన లిక్కర్ స్కామ్ జరిగిందని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో పోలిస్తే జగన్ స్కామ్ పదిరెట్లు పెద్దదన్నారు. '201924 మధ్య ఏపీలో మద్యం విధానం మార్చారు. మద్యాన్ని ప్రైవేటు షాపుల నుంచి ప్రభుత్వ దుకాణాలకు అప్పగించారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. ఐదేళ్ల పాటు మద్యం లావా దేవీలు నగదుతోనే జరిగాయి.

# బడ్జెట్ కసరత్తులో ఆర్థికమంత్రి కేశవ్ బిజీ

**కొత్త అయినా రాజకీయ అనుభవంతో కసరత్తు.. గత ప్రభుత్వ తప్పులపై కన్నేసి అడుగులు**



అమరావతి, (క్రైమ్ మిర్రర్): కొత్తగా ఏపీలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు సిద్ధం అవుతోంది. ఆర్థికమంత్రిగా పయ్యావుల కేశవ్‌కు ఇది తొలి సవాల్ కానుంది. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం లేకున్నా..రాజకీయంగా సుదీర్ఘకాలం ఉన్న అనుభవం ఉంది. అప్పులకుప్పగా ఉన్న ఏపిని గట్టెక్కించడంతో పాటు, అనేక రంగాలను గాడిలో పెడుతున్న తరుణంలో బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. వివిధ శాఖలకు చెందిన మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వంకనుక ఆయన తన విశేష అనుభవంతో సూచనలు సలహాలు ఇస్తున్నారు. ప్రధానంగా అభివృద్ది పక్కకు పోకుండా, సంక్షేమం జారిపోకుండా కత్తిమీద సాములా ఇప్పుడు మంత్రి కేశవ్ కసరత్తు చేస్తున్నారు. ఆయా శాఖల కార్యదర్శులతో మంత్రి పయ్యావుల ప్రీ-బడ్జెటరీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ శాఖలకు కావాల్సిన నిధులను.. ప్రవేశపెట్టబోయే పథకాలను సమీక్షల్లో మంత్రి పయ్యావులకు ఆయా శాఖల మంత్రులు వివరించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులను కేటాయించాల్సిందిగా ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు.. పయ్యావులను కోరారు. ప్రాధాన్యత వారీగా ప్రాజెక్టులకు నిధుల విడుదల చేసే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఏయే ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలోననే అంశంపై ఓ స్పష్టమైన అవగాహనతో ప్రభుత్వం ఉంది. నీటి ప్రాజెక్టులకు రూ.32 వేల కోట్లు కేటాయించాలని జల వనరుల శాఖ ప్రతిపాదించగా.. అంత పెద్దమొత్తంలో కేటాయింపులు అసాధ్యమని.. ఈ ఏడాదికి రూ.21 వేల కోట్లతో సర్దుకోవాలని నిమ్మలకు పయ్యావుల సూచించారు. ఇందులో పోలవరం ప్రాజెక్టుకు రూ.9,000 కోట్లు, గాలేరు-నగరి, హంద్రీ-నీవాకు చెరో రూ.4,500 కోట్లు, వెలిగొండకు రూ.1,800 కోట్లు ఇస్తామన్నారు. అయితే ఈ కేటాయింపులతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఇతర చిన్న, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులను ఎలా చేపడతామని నిమ్మల ప్రశ్నించారు. చాలా ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవన్నారు. ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరారు.గతంలో ఏయే రంగాలను విస్మరించారు, ఎక్కడెక్కడ దుబారా చేశారన్నది గమనించి ముందుకు సాగేలా చర్యలు చేస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ బడ్జెట్‌లో అతిపెద్ద సవాల్‌గా ఉండనుంది. అలాగే వివిధ సంక్షేమ శాఖల్లో అమలు చేయాల్సిన పథకాలు వాటికి అవసరమైన డైట్ కేటాయింపులు చూసుకోవాలి. ఆయా శాఖల మంత్రులు సవిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, గుమ్మడి సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్ ఇప్పటికే ప్రతిపాదనలు ఇచ్చారు. కాగా మైనింగ్ శాఖకు అవసరమైన నిధులను కేటాయించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు మంత్రి పయ్యావులను కోరారు. మైనింగ్ శాఖ నుంచి ఆదాయాన్ని కూడా అదే స్థాయిలో తీసుకురావాలని అధికారులకు మంత్రి సూచించారు. గనుల శాఖ నుంచి వీలైనంత నిధులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారు. ప్రాధాన్యత వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టాలని మంత్రి కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టాల్సి ఉంటుంది.



## స్థానిక ప్రజాప్రతినిధులకు వైఎస్సార్‌సీపీ అండ

**పంచాయితీరాజ్ విభాగం డైరీ ఆవిష్కరణలో జగన్**

గుంటూరు, (క్రైమ్ మిర్రర్): స్థానిక ప్రజాప్రతినిధులకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం డైరీ 2025ని ఆయన ఆవిష్కరించారు. మన హయాంలో గ్రామ స్వరాజ్య స్థాపనకు అనేక చర్యలు తీసుకున్నాం. స్థానిక సంస్థల బలోపేతానికి ఎంతో కృషి చేశాం. ఆర్థికంగా వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాం. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు పేర్ని నాని, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మల్లాది విష్ణు, గడికోట శ్రీకాంత్ రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ ఎంపీపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మరకపూడి గాంధీ, కడప మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి.. తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**1/70 చట్టాన్ని తొలగించే ఉద్దేశ్యం లేదు**

**ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ**



అమరావతి, (క్రైమ్ మిర్రర్): గిరిజన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 1/70 చట్టాన్ని తొలగించే ఉద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. గిరిజన జాతుల అస్తిత్వాన్ని కాపాడుకోవడం అంటే భారతీయ సంస్కృతిని కాపాడుకోవడమేనని తాము బలంగా నమ్ముతున్నామని చెప్పారు. అందుకే వారి విద్య, వైద్యం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తాము నిరంతరం పనిచేస్తున్నామని అన్నారు. ఈ మేరకు సోషల్ మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు స్పందించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు అందించామని గుర్తుచేశారు. అరకు కాఫీతో సహా ఇతర గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో నెం.3ని తీసుకురావడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులు గిరిజనులకు మాత్రమే దక్కేలా కృషి చేశామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా న్యాయపరమైన చిక్కులతో ఆ ఉత్తర్వు రద్దు అయ్యిందని.. దాని పునరుద్ధరణకు తాము కృషి చేస్తామని వివరించారు. గిరిజన ప్రాంతాల్లోని ఆస్తులపై గిరిజనులకే హక్కు ఉండాలన్న ఆలోచనతో వచ్చిన 1/70 చట్టాన్ని మార్చే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదని తేల్చిచెప్పారు.

# తిరుమల లడ్డూపై పదేపదే అబద్ధాల ప్రచారం

- కల్తీ నెయ్యి వాడినట్లు ఎక్కడా రుజువు కాలేదు
- కల్తీ జరిగిందని సిట్ నిర్ధారించినట్లుగా తప్పుడు వార్తలు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ భూమన కరుణాకర్ రెడ్డి



తిరుపతి, (క్రైమ్ మిర్రర్): తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంలో సిట్ జరిపిన అరెస్టులకు సంబంధించి రిమాండ్ రిపోర్టుల్లో ఎక్కడా లడ్డూలో కల్తీ నెయ్యి వాడినట్లు పేర్కొనలేదని టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. అయినా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా ఎల్లో మీడియా.. నెయ్యిలో కల్తీ జరిగిందని సిట్ నిర్ధారించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తిరుపతిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన భూమన కరుణాకర్‌రెడ్డి, ఇకనైనా తప్పుడు ప్రచారం ఆపకపోతే దేవదేవుని ఆగ్రహానికి గురవడం ఖాయమని హెచ్చరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటలు, ఆలోచనల్లోనే కల్తీ కొవ్వు ఉందని.. లడ్డూకి వాడే నెయ్యిలో కల్తీ జరిగే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. నిందితుల రిమాండ్ రిపోర్టులో నెయ్యి కల్తీ జరిగిందని సిట్ చెప్పలేదు. అయినా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా ఎల్లో మీడియాలో మాత్రం నెయ్యి కల్తీ జరిగిందని నిర్ధారణ జరిగిపోయినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భోలే బాబా డెయిరీ, వైష్ణవి డెయిరీ, ఏఆర్ డెయిరీ చేసిన తప్పులపై మాత్రమే సిట్ విచారణ జరిపి రిమాండ్ బాధ్యులను రిమాండ్‌కి తరలించింది. సుప్రీం కోర్టు నియమించిన సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలోని సిట్ బృందం ఎక్కడా నెయ్యి కల్తీపై మాట్లాడలేదు. టెండర్ల అవకతవకలపై మాత్రమే విచారణ జరుగుతోంది. దానికి సంబంధించే నలుగురిని అరెస్టు చేశారు. కానీ, చంద్రబాబు మాత్రం వైఎస్సార్‌సీపీ మీద నిందలు మోపడానికి లడ్డూ తయారీ కోసం పంది కొవ్వును ఉపయోగించారని ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలను కించపరిచారు. పవన్ కళ్యాణ్ మరింత ముందుకెళ్లి సనాతన ధర్మ పరిరక్షణ కోసం తానే అవిర్భవించినట్లు వేషం కట్టి బిల్డప్ ఇచ్చాడు. తిరుపతిలో పవన్ ముందుకు వెళ్లి పవనానంద స్వామి వేషంలో సనాతనధర్మం కోసం నడుం బిగించాను అని, తిరుపతిలో లడ్డూను నీచులు అపవిత్రం చేశారు అని మాట్లాడారు. అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా కల్తీ నెయ్యితో తయారు చేసిన లడ్డూలే పంపారని డిప్యూటీ సీఎం పవనానంద స్వామి తీవ్రమైన నిరాధార ఆరోపణలు చేశారు..నిజానికి అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి పంపిన లక్ష లడ్డూల తయారీకి కావాల్సిన నెయ్యిని చంద్రబాబు నియమించిన టీటీడీ బోర్డులోనే సభ్యుడిగా ఉన్న ముంబైకి చెందిన సౌరభ్ బోరా అనే వ్యక్తి సరఫరా చేశాడు.

# కొంపముంచుతున్న ఏఐ మాధవన్‌కు అనుష్క ఫోన్



వాడకం విరివిగా పెరిగిన క్రమంలో ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోవడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే పలువురు నేరగాళ్ల తమ కార్యక్రమాలను చకచకా చేసుకుంటూ పోతున్నారు. మరోవైపు సినీ, క్రికెట్ తారల అభిమానులు కూడా తమకు నచ్చిన విధంగా వీడియోలను క్రియేట్ చేస్తున్నారు. దీంతో సాధారణ ప్రజలే కాదు, బడా సెలబ్రిటీలు కూడా ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోలేకపోతున్నారు. తాజాగా నటుడు మాధవన్ తనకు ఎదురైనా అనుభవాన్ని ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు. మాధవన్ మాట్లాడుతూ.. 'ఏఐ వల్ల నేను కూడా మోసపోయాను. గతంలో సోషల్‌మీడియాలో నేనొక వీడియో చూశాను. ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో... మన క్రికెటర్ కోహ్లీని ప్రశంసలతో ముంచెత్తున్న వీడియో అది. కోహ్లీ అంటే తనకెంత ఇష్టమో.. ఆయన నాయకత్వ లక్షణాలను పొగుడుతూ రొనాల్డో మాట్లాడారు. అది నాకెంతో నచ్చింది. వెంటనే దానిని షేర్ చేయాలనిపించి ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకున్నా. కొంతసేపటికి అనుష్క శర్మ నుండి నాకు మెసేజ్ వచ్చింది. అది రియల్ వీడియో కాదని.. ఫేక్ అని.. ఏఐతో దానిని సృష్టించారని ఆమె తెలిపింది. ఆ నిమిషం నాకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. టెక్నాలజీ గురించి అవగాహన ఉన్న నేను కూడా ఏఐ వీడియోను గుర్తించలేకపోయాను. కాబట్టి టెక్నాలజీ వల్ల కూడా ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని అర్థమైంది. సోషల్‌మీడియాలో వచ్చే ఏదైనా సందేశాన్ని షేర్ చేయాలంటే అది నిజమేనా? కాదా? అని చెక్ చేసుకోవాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. అలాగే ఆయన తన సినిమా అనుభవాల గురించి మాట్లాడుతూ.. "మరికొన్ని గంటల్లో నా సినిమా ప్రేక్షకుల ముందుకురానుందంటే భయాందోళనకు గురవుతాను. నిజం చెప్పాలంటే నా కెరీర్‌లో రెండే క్షణాలు తెగేంత ఉత్కంఠ కలిగిస్తాయి. సినిమా షూట్‌లో మొదటి రోజు భయం వేస్తుంది. అలాగే సినిమా విడుదల మొదటి రోజు అలాంటి ఆందోళనే ఉంటుంది. రిలీజ్ రోజు ప్రజల అభిప్రాయాలు బయటకు వస్తాయి. ఆశించిన స్థాయిలో లేకపోతే 'నీ గేమ్ ఓవర్' అని అంటారేమోనని భయపడతాను. ఇలాంటి పరిశ్రమలో 25 ఏళ్లుగా కొనసాగతం సులభం కాదు. కొందరు హీరోలు 25 నెలల్లోనే అవకాశాలు కోల్పోతారు. ఈ విషయంలో నేను అదృష్టవంతుడిని. నన్ను ఎంతో మంది ప్రేక్షకులు ఇప్పటికీ ఆదరిస్తున్నారు. వారందరికీ కృతజ్ఞతలు. ఆ అభిమానమే నన్ను ఇంకా పరిశ్రమలో కొనసాగేలా చేశాయి. అది లేకపోతే నేను ఎప్పుడో కనుమరుగయ్యేవాడిని" అని చెప్పారు.



## ఒక్క కిస్ కోసం 37 టేకులు

సినిమా కోసం నటీనటులు పడే కష్టం అంతా ఇంతా కాదు. ఎవరికి వారు తమ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలనే తాపత్రయంతో ప్రతి షాక్ కోసం ఎంతో శ్రమిస్తూ ఉంటారు. మూవీ విషయానికి వస్తే యాక్షన్ సీన్స్, సాంగ్స్ ఒక ఎత్తు అయితే.. రొమాంటిక్ సీన్స్ మరో ఎత్తు. ప్రెజెంట్ డేస్ లో రొమాంటిక్ సీన్స్ సినిమాపై ఎంత ఎఫెక్ట్ చూపిస్తాయో అందరికీ తెలిసిన విషయమే. ఇక నటీనటులు కూడా రొమాంటిక్ సీన్స్ విషయాల్లో కొంచెం అప్డేట్ అవుతూనే ఉంటున్నారు. ఒకప్పుడు రొమాన్స్ అంటే పూలు, కొండలు, పక్షులు ఇలా చూపించేవారు. కానీ ఇప్పుడు ముద్దు సీన్లలో కూడా రెచ్చిపోయి నటించేస్తున్నారు. అయితే ఓ యంగ్ స్టార్ హీరో మాత్రం ముద్దు సీన్ కోసం ఏకంగా 37 టేకులు తీసుకోవడం టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. అతనే బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్. కార్తీక ఆర్యన్ నటించిన సినిమాల్లో కాంచీ ది అన్‌బ్రేకబుల్ అనే మూవీ ఒకటి. మిష్టి ఈ మూవీలో హీరోయిన్‌గా నటించింది. సుభాష్ ఘాయ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం 2014లో రిలీజ్ అయ్యింది. దిగ్గజ నటులు మిథున్ చక్రవర్తి, రిషి కపూర్ కూడా ఈ సినిమాలో ముఖ్య పాత్రల్లో కనిపించారు. అయితే ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో అలరించలేకపోయింది. ఇక రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ యంగ్ హీరో ఈ మూవీ విషయాల గురించి నోరువిప్పాడు. కాంచీ మూవీ షూటింగ్ లోని ఓ ముద్దు సీన్ కోసం బాగా ఇబ్బందిపడ్డానని కార్తీక ఆర్యన్ చెప్పారు. డైరెక్టర్ ప్యాషనేట్ కిస్ కావాలని చెప్పారట.. కానీ తనకు కిస్ సీన్స్ లో యాక్ట్ చేసిన అనుభవం లేకపోవడంతో ఇబ్బంది ఎదుర్కొన్నానని తెలిపారు. సీన్ విషయంలో డైరెక్టర్ కాంప్రమైజ్ కాకపోవడంతో.. ఆ ముద్దు సీన్ కోసం ఏకంగా 37 టేకులు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఒకానొక సిచ్యుయేషన్ లో.. డైరెక్టర్ ని ముద్దు ఎలా పెట్టాలో కాస్త చూపిస్తారా అని అడగాలని కూడా అనుకున్నానాన్నారు. %ూఱఅజవతీఱఅవవఎవత్% అంతే కాకుండా కిస్సింగ్ సీన్‌లో మిష్టి కావాలనే తప్పులు చేసి ఉండొచ్చని కార్తీక్ సరదాగా జోక్ చేశారు. ఇక ఇప్పటికే కార్తీక్ ఆర్యన్ నటించిన సోనుకే టిటుకి స్వీటీ, లుకా చుప్పి, భూల్ భులయ్యా 2 లాంటి చిత్రాలు బ్లాక్ బస్టర్ గా నిలిచాయి. ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తూ దూసుకుపోతున్నాడు ఈ యంగ్ హీరో.

## పెళ్లైన రెండు నెలలకే భర్తకు కీర్తిసురేష్ షాక్



హీరోయిన్ కీర్తి సురేష్ పెళ్లి ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 12న అతి కొద్దిమంది సమక్షంలో కీర్తి సురేష్ వివాహం జరిగింది.తన ప్రియుడు ఆంటోనినే కీర్తి సురేష్ వివాహం చేసుకుంది. తన 15 ఏళ్ల ప్రేమను పరిచయం చేస్తూ మహానటి కీర్తి సురేష్ సర్ ప్రైజ్ ఇచ్చింది. కాలేజ్ డేస్ నుంచే లవ్ స్టోరీ నడిపించిన కీర్తి తాను సినిమాల్లోకి వచ్చి స్టార్ హీరోయిన్ అయినా కూడా ఆ ప్రేమను కొనసాగించింది. తమ ప్రేమను పెళ్లిగా మార్చుకుంది కీర్తి సురేష్. కొద్ది రోజుల క్రితమే తన ప్రేమికుడు ఆంటోనీతో కీర్తి తన లవ్ కన్ఫర్మ్ చేసింది. మొత్తానికి గోవాలో డిసెంబర్ 12న ప్రేమించిన ప్రియుడుని కీర్తి సురేష్ వివాహం చేసుకుంది. డిసెంబర్ 11-12 తేదీల్లో గోవాలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరిగింది. పెళ్లికి సంబంధించిన పనులన్నీ కీర్తి సురేష్ దగ్గరుండి చూసుకుంది.మొదట హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్న కీర్తి సురేష్, తర్వాత తన భర్త ఆంటోని సంప్రదాయం క్రిస్టియన్ మ్యారేజ్ చేసుకుంది. ఈ సందర్భంగా కీర్తి సురేష్ భర్తకు లిప్‌లాక్ ఇచ్చింది. ఇక పెళ్లి తతంగం ముగియగానే కీర్తి సురేష్ తిరిగి తన సినిమా షూటింగ్‌ల్లో పాల్గొంటుంది. ఈ ఏడాది కీర్తి బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే.బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్‌తో కలిసి బేబీ జాన్ అనే సినిమాలో నటించింది. అయితే గతేడాది చివర్లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్‌గా నిలిచింది. దీంతో కీర్తి సురేశ్‌కు నిరాశ తప్పలేదు. అయితే పెళ్లి తర్వాత కొన్నాళ్లు తాళిబొట్టుతో కనిపించింది కీర్తి సురేష్. మోడ్రన్ డ్రెస్‌లో కనిపించిన కీర్తి తన తాళిబొట్టును ప్రదర్శించేందుకు ఆసక్తిని కనబరిచింది.కీర్తి సురేష్ మోడ్రన్ అమ్మాయే అయినా ఇలా తాళిబొట్టును గౌరవించడాన్ని చాలామంది ప్రశంసించారు.అయితే ఇప్పుడు మెడలో తాళిబొట్టుతో కనిపించకుండా అమ్మడు దర్శనం ఇచ్చింది. ఈ మధ్య భర్తతో కలిసి చేసిన ఫొటోషూట్‌ను తన సోషల్ మీడియాలో కీర్తి సురేష్ షేర్ చేయడం జరిగింది. ఈ ఫొటోల్లో కీర్తి మెడలో తాళిబొట్టు లేకుండ కనిపించింది. దీంతో నెటిజన్లు ఆమెపై గట్టిగానే విమర్శలు గుప్పిస్తున్నారు. రెండు నెలలకే మెడలో తాళిబొట్టు బరువైందా అంటూ కీర్తి సురేష్‌ను నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

## భయపెట్టే భవానీ వార్డ్

గాయత్రి గుప్తా, గణేష్‌రెడ్డి, పూజా కేంద్రే, సాయి సతీష్, జబర్దస్త్ అప్పారావు, ఈశ్వర్‌బాబు ధూళిపూడి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'భవానీ వార్డ్ 1997'. జీడీ నరసింహా స్వీయ దర్శకత్వంలో చంద్రకాంత్ సోలంకితో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు.హారర్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా బాగా నచ్చుతుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో నటించడం పట్ల నటీనటులందరూ ఆనందం వెలిబుచ్చారు. ఉత్కంఠను రేకెత్తించే ఈ సినిమాలో ప్రతి ఫ్రేమ్ కొత్తగా ఉంటుందని కెమెరామెన్ అరవింద్ తెలిపారు. హారర్ చిత్రాలకు ఆర్ఆర్ ఇవ్వడం కత్తిమీద సాము లాంటిదని, ఈ సినిమాకు అద్భుతమైన ఆర్ఆర్ కుదిరిందని మ్యూజిక్ డైరెక్టర్ నిస్సి జస్టిన్ చెప్పారు.



## త్వరలో ప్రేక్షకుల ముందుకు మంగళవారం-2

గ్లామర్ తార పాయల్ రాజ్ పుత్ లీడ్ రోల్‌లో నటించిన "మంగళవారం" సినిమా 2023లో విడుదలై సక్సెస్ సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది. సైకలాజికల్ మిస్టరీ థ్రిల్లర్ కథతో దర్శకుడు అజయ్ భూపతి 'మంగళవారం' సినిమాను రూపొందించారు. నందిత శ్వేత, దివ్య పిళ్లై, అజ్మల్ అమీర్, రవీంద్ర విజయ్, కృష్ణ చైతన్య, అజయ్ ఘోష్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం-2కు రంగం సిద్ధం చేశారు మేకర్స్. డైరెక్టర్ అజయ్ భూపతి ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్ ని పూర్తి చేశారట. త్వరలోనే పట్టాలెక్కించనున్నారట. అయితే ఈ సినిమా 'మంగళవారం' సినిమాకి సీక్వెల్ కాదట ప్రీక్వెల్ అని తెలుస్తోంది. ఈ సినిమా బజ్ ని దృష్టిలో పెట్టుకొని ఓ బాలీవుడ్ నిర్మాణ సంస్థ కూడా మేకింగ్ లో భాగస్వామ్యం అయ్యిందట.సినిమా థియేటర్లు ఇక మంగళవారం కథ విషయానికొస్తే.. మహాలక్ష్మీపురంలో మంగళవారం రోజు ఇద్దరు ఇద్దరు ప్రాణాలు కోల్పోతూ వుంటారు. అలా పోయినవాళ్ల గురించి ఆ ఊరి గోడ మీద వాళ్ళకి అక్రమ సంబంధాలు ఉన్నాయని ఎవరో రాస్తూ వుంటారు, అందుకే వాళ్ళు ఆత్మహత్య చేసుకుంటున్నారని గ్రామ ప్రజలు కూడా నమ్ముతూ వుంటారు. కానీ ఆ ఊరికి కొత్తగా వచ్చిన ఎస్సై (నందితా శ్వేత) మాత్రం అవి ఆత్మ హత్యలు అంటే నమ్మదు, అందుకని వాళ్ళకి పోస్ట్ మార్టం చేయించాలని అంటుంది. కానీ ఆ ఊరి జమీందారు ప్రకాశం జమీందారు ప్రకాశంబాబు (చైతన్య కృష్ణ) పోస్ట్ మార్టంకి ఒప్పుకోడు. రెండో సారి ఇద్దరూ చనిపోయినప్పుడు ఎస్.ఐ ఆ శవాలని పోస్ట్ మార్టంకి పంపిస్తుంది, ఆ రిపోర్ట్ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఇదిలా ఉండగా ఆ ఊరి ప్రజలు జట్టు జట్టుగా చీలిపోయి ఎవరు ఇలా గోడమీద రాస్తున్నారు, ఎవరు హత్యలు చేయిస్తున్నారో తెలుసుకుందామని రాత్రిపూట గస్తీ తిరుగుతూ వుంటారు. ఇంతకూ ఆ గోడ మీద రాస్తున్నది ఎవరు? ఎందుకు మంగళవారమే ఆ హత్యలు జరుగుతున్నాయి? ఆ ఊరి నుండి వెలివేయబడిన శైలూ (పాయల్ రాజపుత్) కి ఈ హత్యలకు సంబంధం ఏమైనా ఉందా? జమీందారు దేవుడిని నమ్మడు, కానీ అతని భార్య (దివ్యా పిళ్ళై) ఆ వూర్లో అమ్మవారి జాతరకు అయ్యే ఖర్చు ఇస్తూ ఉంటుంది, ఆమె పాత్ర ఏంటి? శైలు చిన్నప్పటి స్నేహితుడు రవి చనిపోయాడా, బతికున్నాడా? అసలు ఈ మిస్టరీ ఏంటి అనేది 'మంగళవారం' కథ.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.